


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

మేడ్చల్-మల్కాజ్ గిరి | శనివారం | 03-10-2026 | సంపుటి: 3 | సంచిక: 239 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 03-10-2026 | VOLUME : 3 | ISSUE : 239 | PAGES: 8 | COST: 2/-

## గాంధీయిజమే ప్రపంచానికి
# మార్గదర్శకం

- గాడ్సే భావజాలాన్ని వ్యతిరేకించాలి
- గాంధీ సిద్ధాంతాల స్ఫూర్తితోనే ప్రజా పాలన
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3



## రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

- కిలోమీటర్‌కు రూ.15 చొప్పున పెంపు
- తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30
- పెంచిన ధరలు నేటి నుంచే అమల్లోకి
- లగేజీపై కూడా అదనపు ఛార్జీలకు అనుమతి
- జీవో జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, అక్టోబర్ 2:** ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఊరట కల్పించింది. ఆటో ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు రేవంత్ సర్కార్ శుక్రవారం జీవో జారీ చేసింది. కనీస చార్జీని రూ.20 నుంచి రూ.30కి పెంచుతున్నట్లు జజీవోలో పొందుపర్చింది. ప్రతీ కిలోమీటర్‌కు రూ.11 నుంచి రూ.14కి పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇక

మిగతా 2వ పేజీలో..





## రేవంత్ వ్యాఖ్యలతో
# రాజకీయ దుమారం

- రాముడు ధనికుల దేవుడు.. శివుడు పేదల దేవుడంటూ సీఎం వ్యాఖ్యలు
- ఉత్తరాది-దక్షిణాది కోణంలో దేవుళ్ల ఆరాధనను ప్రస్తావించడంపై విమర్శలు
- ఆర్య-ద్రావిడ, శైవ-వైష్ణవ విభజనలపై రాజకీయ చర్చ
- బీజేపీ హిందూత్వ రాజకీయాలకు కాంగ్రెస్ ప్రత్యామ్నాయ వ్యూహమా?
- రేవంత్ వ్యాఖ్యలు బీజేపీకి రాజకీయ అస్త్రంగా మారే అవకాశంపై చర్చ

**హైదరాబాద్, అక్టోబర్ 2:** బీజేపీ హిందూత్వ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ అనుసరిస్తున్న వ్యూహంపై చర్చ జరుగుతున్న వేళ.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. రాముడు ధనికుల దేవుడని, శివుడు పేదల దేవుడని.. ఉత్తరాదివారు రాముడిని, దక్షిణాదివారు శివుడిని ఆరాధిస్తారని ఆయన పేర్కొన్న వ్యాఖ్యలు ఇప్పుడు వివాదానికి కేంద్రంగా మారాయి. గతంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ శివుడి చిత్రాన్ని ప్రదర్శిస్తూ ప్రసంగించిన అంశాన్ని కూడా రాజకీయ వర్గాలు ప్రస్తావిస్తున్నాయి.

**దేవుళ్ల ఆరాధనపై కొత్త చర్చ**

రాముడు, శివుడి ఆరాధనను పేదలు-ధనికులు, ఉత్తరాది-దక్షిణాది అనే విభజనలతో ముడిపెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హిందూ సంప్రదాయాల్లో శైవ, వైష్ణవ ఆరాధనా విధానాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నప్పటికీ.. రాముడు, శివుడిని పరస్పర విరుద్ధ దేవతలుగా భావించే సంప్రదాయం లేదని విమర్శకులు పేర్కొంటున్నారు. హరిహర రూపంలోనూ ఇద్దరినీ ఏకరూపంగా ఆరాధించే సంప్రదాయం ఉంది. తెలంగాణలోని భద్రాచలం శ్రీరామక్షేత్రాన్ని దక్షిణ అయోధ్యగా, వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని దక్షిణ కాశీగా భక్తులు

మిగతా 2వ పేజీలో..

## 4న రాష్ట్రానికి అమిత్ షా రాక

- తూప్రాన్‌లో అమూల్ డెయిరీ ప్లాంట్ ప్రారంభోత్సవం
- సబర్ డెయిరీ ప్రాజెక్టుకు భూమి పూజ
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

3



3

## హైదరాబాద్‌లో ఏనుగు దంతాల స్మగ్లింగ్..
# ముగ్గురు అరెస్ట్

- డీఆర్ఐ వలలో వన్యప్రాణుల అక్రమ రవాణా ముఠా
- నిందితుల నుంచి 17 కిలోల బరువున్న నాలుగు ఏనుగు దంతాలు స్వాధీనం
- దంతాలతో తయారు చేసిన ఐవరీ ట్రోఫీలు కూడా పట్టివేత
- విక్రయించే సమయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
- దంతాల మూలం, అక్రమ నెట్‌వర్క్ పై కొనసాగుతున్న దర్యాప్తు



4

## కెప్టెన్ స్మిత్ ధైర్యానికి
# మోదీ ప్రశంసలు

- ఫ్లైదుబాయ్ ఘటనపై కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో ప్రధాని ఫోన్‌లో సంభాషణ
- కోపైలట్ దాడిలో గాయపడినా విమానాన్ని కాపాడిన పైలట్
- కీలక సమయంలో తీసుకున్న నిర్ణయం ఎన్నో ప్రాణాలను కాపాడిందన్న మోదీ
- "భారతీయులు ప్రాణాలు తీసేవారు కాదు.. ప్రాణాలు కాపాడేవారు" అని ప్రశంస
- తనకు ప్రధాని మోదీయే ఆదర్శమన్న కెప్టెన్ స్మిత్ మచ్చర్

## విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను
# అడ్డుకోవాలి

- దశాబ్దాలుగా ప్రభుత్వాలు నిర్మించిన ప్రజల ఆస్తులివి
- కాంగ్రెస్ జాతీయ విధానం ఒకలా, తెలంగాణలో మరోలా ఏంటి?
- రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ



2



2

## 'సర్' విచారణ
# మీ ఇంటి వద్దే..

- కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన ఈసీ
- ఓటుకు భద్రత కల్పించేలా నిర్ణయం

## డిసెంబర్ 9 నుంచి
# సర్కారు బడుల్లో బ్రేక్‌ఫాస్ట్!

- హరేకృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్, చైన్ ల్యాబ్స్ తో ఒప్పందాలు
- రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి కేంద్రీకృత వంటశాలల ప్రారంభం
- నవంబర్ 30లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- ఆహార నాణ్యతపై నిరంతర నిఘా.. కమాండ్ కంట్రోల్ కేంద్రంతో అనుసంధానం
- విద్యార్థుల శారీరక ఎదుగుదల, విద్యా పురోగతిపై ప్రత్యేక రికార్డు
- నాగర్‌కర్నూల్, వికారాబాద్ వంటశాలలకు రూ.9.17 కోట్ల సహకారం



3

## మెట్రో-ఆర్టీసీ కామన్ పాస్ వచ్చేసింది



- ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు
- సీఎం, మంత్రులకు కామన్ పాస్ కొనుగోలు
- ఆటో చార్జీల పెంపుపై సానుకూల నిర్ణయం : మంత్రి పొన్నం

3

## బాపూ ఘాట్‌లో మహాత్ముడికి నివాళులు



2



2

## కళ్యాణలక్ష్మి కేసీఆర్ మానవీయ
# పాలనకు నిదర్శనం: కేటీఆర్

- 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేటీఆర్ శుభాకాంక్షలు
- గిరిజన తండాలో చూసిన ఘటనతో కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం
- పేదింటి ఆడబిడ్డల పెళ్లికి రూ.1,00,116 ఆర్థిక సాయం



## ముంబైలో పోటాపోటీ నిరసనలు

- సీఈసీ రాజీనామా డిమాండ్ చేస్తూ సీజేపీ ఆందోళన
- సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్' ఆందోళన

4




# కళ్యాణలక్ష్మి కేసీఆర్ మానవీయ పాలనకు నిదర్శనం: కేటీఆర్

- 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేటీఆర్ శుభాకాంక్షలు
- గిరిజన తండాలో చూసిన ఘటనతో కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం
- పేదింటి ఆడబిడ్డల పెళ్లికి రూ.1,00,116 ఆర్థిక సాయం
- ఇప్పటివరకు 16.78 లక్షల పేద కుటుంబాలకు లబ్ధి
- కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని నీరుగార్చేందుకు కుట్ర చేస్తోందని కేటీఆర్ ఆరోపణ

**హైదరాబాద్, అక్టోబర్ 2:**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మానవీయ పాలనకు కళ్యాణలక్ష్మి పథకం నిలువెత్తు నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పథకం ప్రారంభమై 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'ఎక్స్' వేదికగా ఆయన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఓ గిరిజన తండాలో తాను చూసిన ఘటన కేసీఆర్‌ను ఈ పథకానికి శ్రీకారం చుట్టేలా చేసిందని కేటీఆర్ వివరించారు.

**పేద కుటుంబాలకు అండగా..**

ఆడబిడ్డ పెళ్లి సమయంలో తల్లిదండ్రులపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడిందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలోని లక్షలాది కుటుంబాలకు పెళ్లి సమయంలో కేసీఆర్ మేనమామలా అండగా నిలిచారని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహానికి రూ.1,00,116 ఆర్థిక సాయం అందించాలన్న ఆలోచన కేసీఆర్‌కు వచ్చిందని కొనియాడారు. ఈ పథకం బాల్య వివాహాలను తగ్గించడంలోనూ దోహదపడిందని తెలిపారు.

**16.78 లక్షల కుటుంబాలకు లబ్ధి**

గత 12 ఏళ్లలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా 16.78 లక్షల పేద కుటుంబాలు ప్రయోజనం పొందాయని కేటీఆర్ తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణలక్ష్మి పథకాన్ని నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన తులం బంగారం సంగతి పక్కనపెడితే.. అసలు కళ్యాణలక్ష్మి పథకాన్నే రద్దు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.
పథకం 12వ వార్షికోత్సవం సందర్భంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.



# రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

**మొదటిపేజీ తరువాయి**

టిటెన్షన్ చార్జి 50 పైసల నుంచి 75 పైసలకు పెంచగా.. లగేజీ ఛార్జీ 25 పైసల నుంచి 50 పైసలకు పెంచారు. ఇక గరిష్ట లగేజీ పరిమితి 100 కిలోలుగా కొనసాగించారు. ఇక రాత్రి సమయాల్లో ఛార్జీలపై 1.5 రెట్లు కొనసాగించారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఆటో ఛార్జీలను ప్రభుత్వం సవరించింది.కొత్త ఆటో ఛార్జీల అమలు కోసం మీటర్ల రీసెట్టింగ్‌కు ప్రభుత్వం 3 నెలల గడువు విధించింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఒకటిన్నర శాతం అదనపు ఛార్జీలు వసూలు చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. మూడు నెలల్లోగా ఆటో డ్రైవర్లు డిజిటల్ మీటర్లను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఆటో ఛార్జీలను అధికారికంగా ధృవీకరిస్తూ జీ.ఓ. 46 జారీ చేసింది. ఈ చార్జీలు తక్షణమే అమల్లో వస్తాయని వెల్లడించింది. ఇక ట్రాఫిక్ లేదా ఇతర కారణాల వల్ల ఆటో ఆగినప్పుడు నిమిషానికి 75 పైసలు చొప్పున వెయిటింగ్ ఛార్జీ ఖరారు చేశారు. రాత్రి సమయాల్లో ప్రయాణించేవారు సాధారణ ఛార్జీల కంటే అదనంగా 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఇక ప్రయాణికులు ఆటోలో తమ వెంట హ్యాండ్ బ్యాగ్, బ్రీఫ్ కేస్ వంటికి ఉచితంగా తీసుకెళ్లవచ్చు. ఇతర పెద్ద లగేజీలు తీసుకెళ్లాలంటే కిలో మీటర్‌కు 50 పైసలు చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.ఆటోలో తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30గా ఫిక్స్ చేశారు. ఆ తర్వాత ప్రతీ అదనపు కిలోమీటర్‌కు రూ.15 చొప్పున ఖరారు చేశారు. ఇక కొత్త ధరలపై ఆటోల్లో ఫేర్ కార్డులను ఏర్పాటు చేయాలని డ్రైవర్లను ప్రభుత్వం ఆదేశించింది. కాగా ఆటో ఛార్జీలను పెంచాలని డ్రైవర్ల సంఘాలు ఇటీవల సమ్మెకు పిలుపునిచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆటోలను నిలిపివేసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీంతో ప్రభుత్వం దిగొచ్చి ఆటో సంఘాలతో చర్చలు జరిపింది. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంతో ఆటో డ్రైవర్లు సమ్మెపై వెనక్కి తగ్గారు. ఈ క్రమంలో ఆటో ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. అలాగే డ్రైవర్ల సంక్షేమ కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసే పనిలో ప్రభుత్వం ఉంది. అయితే ఛార్జీల పెంపు వల్ల డ్రైవర్లకు ప్రయోజనం చేకూరనుండగా సామాన్యులకు భారమనే చెప్పుకోవచ్చు.

# బాపూ ఘాట్‌లో మహాత్ముడికి నివాళులు

**హైదరాబాద్, అక్టోబర్ 2 :**

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా లంగర్ హౌస్‌లోని బాపూ ఘాట్ లో ఆయనకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు ఘన నివాళులర్పించారు. గాంధీ చూపిన అహింస, సత్యాగ్రహంలను, దేశానికి ఆ మహనీయుడు అందించిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అజరుద్దీన్, పొన్నం ప్రభాకర్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, రామచంద్ర నాయక్, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం బాపూ ఘాట్ లో డిజిటల్ మ్యూజియాన్ని గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.



# రేవంత్ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

**మొదటిపేజీ తరువాయి**

భావించడం ఇందుకు ఉదాహరణగా ప్రస్తావిస్తున్నారు.
ఈ నేపథ్యంలో దేవతల ఆరాధనను సామాజిక, ఆర్థిక, ప్రాంతీయ విభజనలతో అనుసంధానిస్తూ రాజకీయ వ్యాఖ్యలు చేయడం వెనుక కాంగ్రెస్ వ్యూహం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బీజేపీకి అనుకూలంగా ఉన్న హిందూ ఓటు సమీకరణాలను ఇతర సామాజిక, ప్రాంతీయ అంశాలతో ప్రభావితం చేసే ప్రయత్నంలో భాగంగానే ఇలాంటి వ్యాఖ్యలు వస్తున్నాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**బీజేపీకి ప్రచార అస్త్రమయ్యేనా?**

కాంగ్రెస్ అనుసరిస్తున్న ఈ తరహా వైఖరి ఆ పార్టీకే ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉందన్న చర్చ కూడా సాగుతోంది. హిందూ దేవతల ఆరాధనను రాజకీయ చర్చలోకి తీసుకురావడం ద్వారా బీజేపీకి కాంగ్రెస్‌పై విమర్శలు చేసేందుకు మరింత అవకాశం లభిస్తుందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఆధారంగా చేసుకుని కాంగ్రెస్ హిందూ విశ్వాసాలను విభజన కోణంలో చూస్తోందన్న ప్రచారాన్ని బీజేపీ చేపట్టే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీల మధ్య హిందూత్వ రాజకీయాలపై తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. రాముడుశివుడు, ఉత్తరాదిదక్షిణాది, ఆర్యద్రావిడ అంశాలు రాజకీయ వేదికపైకి రావడం మరింత విభజనాత్మక చర్చకు దారితీసే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**సెల్ఫ్ గోల్‌గా మారేనా?**

రాజకీయ ప్రత్యర్థి సిద్ధాంతాన్ని ఎదుర్కొనే క్రమంలో మత విశ్వాసాలను విభజన కోణంలో ప్రస్తావించడం ఆశించిన ఫలితానికి బదులుగా ప్రత్యర్థులకు ప్రచార అవకాశాలను కల్పించవచ్చన్న చర్చ సాగుతోంది. ముఖ్యంగా రాముడు, శివుడి ఆరాధనను పేదలుధనికులు లేదా ఉత్తరాదిదక్షిణాది అనే గీతలతో చూడటం సాధారణ భక్తి సంప్రదాయాలకు భిన్నమైన రాజకీయ వ్యాఖ్యానంగా విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయ వ్యూహంపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. హిందూత్వ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ ఎలాంటి భావజాలాన్ని, విధానాన్ని ప్రజల ముందుంచుతుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మత విశ్వాసాలను రాజకీయ విభజనలకు అనుసంధానించే వ్యాఖ్యలు చివరకు ఎలాంటి రాజకీయ ప్రభావాన్ని చూపుతాయన్నది రానున్న రోజుల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# 'సర్' విచారణ మీ ఇంటి వద్దే..

- కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన ఈసీ
- వోటుకు భద్రత కల్పించేలా నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబర్ 2:**

రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలను ఇచ్చింది. వోటర్లకు నష్టం జరగకుండా, ఇబ్బంది కలగకుండా వారి వోటుకు భద్రత కల్పించేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను వోటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తాజాగా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సీఈఓ సి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా వోటర్లను నోటీసులు అందుకోవడానికి లేదా అవసరమైన పత్రాలు సమర్పించడానికి కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు వోటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు.ఇకపై సాధారణంగా వోటర్లను విచారణ కోసం కార్యాలయాలకు పిలవరాదని సీఈఓ తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త వోటరు నమోదు కోసం ఫారం6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని సీఈఓ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ అవసరం లేకపోయినప్పటికీ తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం6, ఫారం7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. వోటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఫారం6, పెండింగ్ నోటీసులు, ఫారం7, ఫారం8కు సంబంధించిన వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని సీఈఓ ఆదేశించారు. ఎస్ఐఆర్2026 ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దశను పారదర్శకంగా పూర్తి చేయాలని సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. ఇక తాజా ఆదేశాలతో విచారణకు రాని వారి ఇళ్ళకు నేరుగా బీఎల్ వోలు వెళ్లి కావాల్సిన డాక్యుమెంట్స్ తీసుకోవాలని సూచించారు.

## నేను పోటీలో ఉన్నా..

**సూర్యాపేట, అక్టోబర్ 2:**

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థిగా తాను ఎన్నికల బరిలో దృఢంగా నిలుస్తున్నానని రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన ఆయన విడుదల చేశారు. తన పేరును పార్టీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించిందని, పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ కాంగ్రెస్ అభ్యర్థిగా తాను ఎన్నికల బరిలో నిలుస్తున్నానని రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. అధిష్ఠానం తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌తో కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నట్లు తెలిపారు. అయితే తన అభ్యర్థిత్వంపై కొందరు కావాలనే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను టికెట్ అడగలేదని , ఎమ్మెల్సీగా పోటీ చేయడానికి సిద్ధంగా లేనని చేతులెత్తేశారని, యూ టర్న్ తీసుకున్నారని అంటూ ప్రచారం చేయడం దుర్మార్గమని అన్నారు. తాను ఎన్నికల నుంచి తప్పుకుంటానని ఎక్కడ కూడా చెప్పలేదని పేర్కొన్నారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను పూర్తి నిబద్ధతతో స్వీకరిస్తున్నానని తెలిపారు. యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం తన లక్ష్యమని తెలిపారు. తన దీర్ఘకాలిక రాజకీయ లక్ష్యాల గురించి గతంలో చెప్పిన విషయాలను ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలతో ముడి పెట్టి వక్రీకరించడం సరికాదని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి, పట్టభద్రుల సమస్యలకు బలమైన ప్రాతినిధ్యం వహించడమేనని తన ప్రస్తుత లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నానని, ఎన్నికల బరిలో ఉన్నానని, పట్టభద్రుల ఆశీస్సులతో ముందుకు సాగుతానని ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయం లో వెనకడుగు వేసే ప్రసక్తి లేదని తెలిపారు. ఇక "రెండు సీట్లు రెడ్లకే ఇవ్వడంతో బీసీ వర్గాల్లో ఆగ్రహం వచ్చిందని, అందుకే కాంగ్రెస్ అభ్యర్థిని మార్చబోతోందని" చేస్తున్న ప్రచారానికి కూడా ఎలాంటి ఆధారం లేదని తెలిపారు.

# ఇకపై అన్ని సబ్జెక్టులకు ప్రాక్టికల్స్?

- సిలబస్ తోపాటు మారిన మార్కుల విధానం

**హైదరాబాద్, అక్టోబర్ 2:**

రాష్ట్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరం (2026 27) నుంచి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు కీలక మార్పులు తీసుకొచ్చింది. చదువుకునే సిలబస్ తోపాటు పరీక్షల విధానంలోనూ సమూల మార్పులు చేశారు. ఇప్పటివరకు కేవలం కొన్ని సబ్జెక్టులకే పరిమితమైన ప్రాక్టికల్స్ ను ఇప్పుడు అన్ని సబ్జెక్టులకు (ఇంటర్నల్ అసెస్మెంట్ రూపంలో) ప్రవేశపెట్టారు. ఈ కొత్త విధానంపై విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. కొత్త విధానం ప్రకారం మొత్తం మార్కుల్లో రాత పరీక్షకు 80శాతం, ప్రాక్టికల్స్ కు 20 శాతం మా



ర్కులను కేటాయించారు. ఒకవేళ ఎగ్జామ్ 80 మార్కులకు ఉంటే విద్యార్థులు పాస్ కావాలంటే కనీసం 28 మార్కులు (35 శాతం) సాధించాల్సి ఉంటుంది. అలాగే ప్రాక్టికల్స్ కు కేటాయించిన 20 మార్కులలో కనీసం 7 మార్కులు వస్తేనే పాసైనట్లు లెక్క. సైన్స్ సబ్జెక్టుల విషయానికి వస్తే గతంలో కేవలం సెకండియర్ లోనే ప్రాక్టికల్స్ ఉండేవి. కానీ, ఇకపై ఫస్టియర్ లోసగం, సెకండియర్ లో మరో సగం చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఇంగ్లీష్ సబ్జెక్ట్ విషయంలోనూ బోర్డు స్పష్టతనిచ్చింది. ఫస్టియర్ విద్యార్థులకు ఒకే ఒక పాఠ్య పుస్తకం ఉంటుంది. ఇక సెకండ్ ఇయర్ లో టెక్స్ట్ బుక్ తోపాటు ప్రత్యేకంగా 'ఇంగ్లీష్ ప్రాక్టికల్ మాన్యువల్' కూడా అందుబాటులో ఉంటుంది. ఈ కొత్త మార్పులు, సిలబస్ వివరాలు, సబ్జెక్టుల వారీగా మార్కుల కేటాయింపు వంటి సమస్త సమాచారాన్ని అధికారిక వెబ్సైట్ లో పొందుపరిచామని బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ తెలిపారు. ఈ కొత్త పరీక్షా విధానంపై విద్యార్థులకు ఎటువంటి గందరగోళం లేకుండా చూడాల్సిన బాధ్యత కళాశాలల యాజమాన్యాలపై ఉంది. ఏ సబ్జెక్టుకు ఎన్ని మార్కులు ఉంటాయి. పాస్ మార్కులు ఎలా లెక్కగడతారు అనే వివరాలను ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించాలని బోర్డు ఆదేశించింది.

# విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

- దశాబ్దాలుగా ప్రభుత్వాలు నిర్మించిన ప్రజల ఆస్తులివి
- కాంగ్రెస్ జాతీయ విధానం ఒకలా, తెలంగాణలో మరోలా ఏంటి?
- రాయపూర్ ఆర్థిక తీర్మానాలను రాష్ట్ర ప్రభుత్వం పాటిస్తుందా?
- రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ



**హైదరాబాద్, అక్టోబర్ 2:**

టీజీట్రాన్స్‌కో, టీజీజెన్‌కో, సింగరేణి, డిస్కంలు, ఇతర వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలపై కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఈమేరకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత టీజీట్రాన్స్‌కో 26 శాతం ఈక్విటీ డైల్యూషన్/ ఐపీఓ (వాటా తగ్గింపు) నిర్ణయం మొత్తం ప్రభుత్వ విద్యుత్ సంస్థల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నదన్నారు. ఇది రాష్ట్రంలోని వ్యూహాత్మక విద్యుత్ మౌలిక వసతుల భవిష్యత్ యాజమాన్యం, నియంత్రణకు సంబంధించిన కీలక అంశమని, టీజీట్రాన్స్‌కో ఒక సాధారణ వాణిజ్య సంస్థ కాదని, తెలంగాణ విద్యుత్ వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన కీలక ప్రజా సంస్థ అని గుర్తు చేశారు. టీజీట్రాన్స్‌కో పరిధిలో 29,400 కేవీ సబ్‌స్టేషన్లు, 107, 220కేవీ సబ్‌స్టేషన్లు, 337, 132కేవీ సబ్‌స్టేషన్లు, 31,420కు పైగా సర్క్యూట్ కి.మీ ఈహెచ్ టీ లైన్లు, 1,184 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 43,848 ఎంవీఏ ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యం ఉన్నాయని తెలిపారు. దశాబ్దాలుగా ప్రజాధనంతో, గత ప్రభుత్వాల కృషితో నిర్మించిన ఈ ప్రభుత్వ ఆస్తులను రాత్రికి రాత్రి ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. 26 శాతం వాటా తగ్గింపు మొదటి అడుగు మాత్రమే.. భవిష్యత్తులో మిగిలిన వాటాను కూడా ప్రైవేటు చేతుల్లోకి అప్పగించే మార్గాన్ని సుగమం చేస్తున్నారు.. అంటే టీజీట్రాన్స్‌కో తర్వాత టీజీజెన్‌కో, సింగరేణి, డిస్కంలు కూడా ఇదే బాట పట్టనున్నాయా అని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని ఢిల్లీలో కాంగ్రెస్ ఒక మాట.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మరో మాటా అని నిలదీశారు. కాంగ్రెస్ 2019 మేనిఫెస్టోలో వ్యూహాత్మకేతర, నాన్‌కోర్ ప్రభుత్వ రంగ సంస్థలకే డిజ్‌ఇన్వెస్ట్‌మెంట్‌ను పరిమితం చేయాలని పేర్కొందన్నారు. 2023 రాయ్‌పూర్ కాంగ్రెస్ ప్లీనరీ ఆర్థిక తీర్మానంలో కూడా డిజ్‌ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో ప్రైవేట్ మోనోపాలీలు, డ్యూపాలీలు ఏర్పడకూడదని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. మరి రాష్ట్రంలో వ్యూహాత్మక విద్యుత్ సంస్థ అయిన టీజీట్రాన్స్‌కోలో ఈక్విటీ డైల్యూషన్ ఏ కాంగ్రెస్ విధానం ప్రకారం చేస్తున్నారు.. కాంగ్రెస్ సీడబ్ల్యూసీ తీర్మానాలు ఢిల్లీకి మాత్రమే పరిమితమా.. తెలంగాణలో వర్తించవా అని నిలదీశారు. మీరు కేంద్ర ప్రభుత్వ ప్రజా ఆస్తుల మానిటైజేషన్, ప్రైవేటీకరణ విధానాలను పదేపదే ప్రశ్నించారు.. ఎల్ఐసీ, విద్యుత్ రంగం వంటి వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా తగ్గింపుపైనా మీరు ఆందోళనలు వ్యక్తం చేశారు.. అదేవిధంగా ఉత్తరప్రదేశ్‌తో పాటు కాంగ్రెస్ అధికారంలో లేని ఇతర రాష్ట్రాల్లో విద్యుత్ రంగ ప్రైవేటీకరణను కాంగ్రెస్ వ్యతిరేకించింది.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఈ రాష్ట్రంలో అదే సూత్రం వర్తించాలి అని స్పష్టం చేశారు.
టీజీట్రాన్స్‌కో ప్రైవేటీకరణపై రాహుల్‌గాంధీ మౌనం వహిస్తే.. కాంగ్రెస్ జాతీయ విధానం, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ విధానం ఒక్కటి కానట్లేనా? తెలంగాణ ప్రభుత్వాన్ని సూటిగా అడుగుతున్నాం..టీజీట్రాన్స్‌కోలో 26 శాతం వాటా ఎందుకు తగ్గిస్తున్నారు? టీజీజెన్‌కోకు సంబంధించి ఏం చేయబోతున్నారు?సింగరేణిపై ఎలాంటి ప్రతిపాదనలు ఉన్నాయి? డిస్కంల భవిష్యత్ యాజమాన్యంపై ప్రభుత్వం ఆలోచన ఏమిటి? ప్రజల ఆస్తులను ప్రజల అనుమతి లేకుండా ప్రైవేట్ ప్రయోజనాలకు అప్పగించే నిర్ణయాలు తీసుకోవద్దు.
ప్రభుత్వ ఆస్తుల యాజమాన్యం లేదా నియంత్రణను ప్రభావితం చేసే నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలి. టీజీట్రాన్స్‌కో ఐపీఓ, 26 శాతం ఈక్విటీ డైల్యూషన్‌ను తక్షణమే నిలిపివేయాలి. టీజీజెన్‌కో, సింగరేణి, డిస్కంలు, ఇతర వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థలపై ఐపీఓ, ఈక్విటీ డైల్యూషన్, ప్రైవేటీకరణ ఆలోచనలను ఉపసంహరించుకోవాలి. ఈ ప్రతిపాదనలు కాంగ్రెస్ 2019 మేనిఫెస్టో, 2023 రాయ్‌పూర్ ఆర్థిక తీర్మానాలకు ఎలా అనుగుణంగా ఉన్నాయో తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ విధానం మారితే బహిరంగంగా ప్రకటించాలి.. విధానం మారకపోతే తెలంగాణ ప్రభుత్వాన్ని నిలువరించాలి.. ఒక జాతీయ పార్టీ విశ్వసనీయత తీర్మానాలు చేయడంలో కాదు.. వాటిని అమలు చేయడంలో ఉంటుంది అని పేర్కొన్నారు. అందుకే రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ వెంటనే జోక్యం చేసుకుని టీజీట్రాన్స్‌కో ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు. టీజీట్రాన్స్‌కోతో మొదలయ్యే ప్రైవేటీకరణకు ఇక్కడే అడ్డుకట్ట వేయాలి.. టీజీజెన్‌కో, సింగరేణి, డిస్కంలను కూడా ప్రైవేటీకరణ బారి నుంచి కాపాడాలి అని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ద్వంద్వ విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారన్న విషయం గుర్తించి వ్యవహరించండి అని హరీష్‌రావు హితవు పలికారు.

# మెట్రో-ఆర్టీసీ కామన్ పాస్ వచ్చేసింది



**హైదరాబాద్, అక్టోబర్ 2 :**
హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు శుభవార్త. మెట్రో, ఆర్టీసీ సేవలకు కామన్ పాస్ అందుబాటులోకి వచ్చింది. ఈ కామన్ పాస్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిలతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎంతో కలిపి 15మంది మంత్రులకు వన్ డే ఆర్టీసీమెట్రో కామన్ పాస్‌ను ఆయన కొనుగోలు చేశారు. ఈ పాస్ ద్వారా శనివారం ఉదయం 10 గంటలకు బేగంపేట నుంచి భట్టి విక్రమార్క, మంత్రులు మెట్రోలో ప్రయాణం చేస్తారని మంత్రి పొన్నం ప్రకటించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ హైదరాబాద్‌లో వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, దీంతో నగరం దశ దిశ మారుతుందని చెప్పారు. హైదరాబాద్ మహా నగరంలో ప్రస్తుతం రూ.52,000 కోట్ల పనులు జరుగుతున్నాయని, ఫేజ్2లో రూ.38,000 కోట్ల మెట్రో పనులు చేపడుతున్నామని భట్టి చెప్పారు. 366 కి.మిలతో రీజినల్ రింగ్ రోడ్డును, 21 రేడియల్ రోడ్లను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. మూసీ పునర్నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. 30వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మోస్ట్ లివబుల్ సిటీగా హైదారాబాద్‌ను తీర్చిదిద్దుతున్నామన్నారు. హైదారాబాద్‌లో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులే నడిపేందుకు ప్రయత్నిస్తున్నామని, ఆటోలకు రెట్రో ఫిట్ మెంట్‌ను తీసుకొచ్చామని చెప్పారు.

**ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తాం: మంత్రి పొన్నం**

ఆర్టీసీకి ప్రభుత్వం నెలకు రూ.300 కోట్లు విడుదల చేస్తున్నదని అదనంగా రూ.50 కోట్లు కలిపి మొత్తం రూ.350 కోట్లు విడుదల చేస్తూ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మంత్రి పొన్నం కోరారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీపై పెరిగిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి పొన్నం అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వరకు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతమైతే ట్రాఫిక్ సమస్యలు, కాలుష్యం తగ్గుతాయని చెప్పారు. ఆర్టీసీ, మెట్రో, ఆటో సేవలను సమన్వయం చేసి ప్రజలకు సులభమైన ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఫస్ట్ మైల్‌లాస్ట్ మైల్ కనెక్టివిటీపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఆర్టీసీ, మెట్రోతోపాటు ఆటో రంగాన్ని కూడా ప్రజా రవాణా వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యలు, జీవనోపాధి, సంక్షేమాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుంటుం దన్నారు. దాదాపు 12 ఏళ్లుగా పెరగని ఆటో చార్జీల పెంపునకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ప్రజలపై అదనపు భారం పడకుండా, ఆటో డ్రైవర్లకు న్యాయం జరిగేలా చార్జీల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం చెప్పారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని, ఆర్టీసీ కార్మికుల సంక్షేమంతోపాటు ఆటో కార్మికుల సంక్షేమానికీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో ఆర్టీసీ, మెట్రో, ఆటో తదితర రవాణా వ్యవస్థలను టెక్నాలజీతో అనుసంధానం చేస్తామన్నారు. ప్రయాణికులకు సులభమైన, సురక్షితమైన, వేగవంతమైన రవాణా సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మీ టికెట్ యాప్ ద్వారా ఓపెన్ టికెట్.. డిజిటల్ వీక్లీ బస్ పాస్ - రూ.600లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు లాంఛనంగా ప్రారంభించారు.కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు పట్నం మహేందర్ రెడ్డి , అద్దంకి దయాకర్, సీఎస్ సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,హైదరాబాద్ మెట్రో ప్రభుత్వ సలహాదారు ఎన్వీఎస్ రెడ్డి, జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

**అర్బనైజేషన్‌కు అనుగుణంగా ప్రజా రవాణా సర్వీసులు పెరగాలి : మంత్రి వివేక్**

హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి ప్రాంతాల్లో అర్బనైజేషన్‌కు అనుగుణంగా ప్రజా రవాణా సర్వీసులను మరింత పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి అభిప్రాయపడ్డారు. మంత్రి పొన్నం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్ సర్వీసులు గణనీయంగా మెరుగుపడ్డాయని కొనియాడారు. నగరంలో కొత్త బస్సులను ప్రవేశపెట్టడం, మైనర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీని మరింత బలోపేతం చేసే అవకాశం ఏర్పడిందన్నారు. మెట్రో రైలుఆర్టీసీ బస్సుల మధ్య మెరుగైన కనెక్టివిటీతో ప్రయాణికులకు మరింత సౌకర్యం కలుగుతుందని చెప్పారు. ప్రస్తుతం మెట్రోలో ప్రయాణిస్తున్న వారి సంఖ్యను 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచే దిశగా చర్యలు అవసరమన్నారు. మెట్రో, ఆర్టీసీ సమన్వయంతో పనిచేస్తే హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చునని, మెట్రో స్టేషన్లకు ఆర్టీసీ బస్సుల కనెక్టివిటీ పెంచితే ప్రయాణికులకు చివరి మైలు ప్రయాణం మరింత సులభం అవుతుందని తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యలు, చార్జీల అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ఆటో డ్రైవర్లతో చర్చించి వారికి న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్టీసీమెట్రో సమన్వయంతో తీసుకొచ్చిన ఈ కార్యక్రమం ప్రజా రవాణా రంగంలో మరో ముందడుగు అంటూ ఈ ప్రజా ప్రయోజన కార్యక్రమాన్ని చేపట్టిన మంత్రి పొన్నంకు వివేక్ అభినందనలు తెలిపారు.

**మీ సేవ కేంద్రాల ద్వారా కామన్ బస్సు పాస్‌ల జారీ**

సీఎస్ సంజయ జాజు మాట్లాడుతూ నగర ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు ఆర్టీసీ, మెట్రో రైల్ కామన్ పాస్ విధానాన్ని ప్రారంభించడం శుభ పరిణామమని అన్నారు. నగరంలో ప్రతీ రోజు దాదాపు 30 లక్షల మంది ఆర్టీసీ బస్సులలో ప్రయాణిస్తున్నారని, అదేవిధంగా దాదాపు ఐదు లక్షల మంది మెట్రో రైళ్లలో ప్రయాణం చేస్తున్నారని వెల్లడించారు. ఒక్కో ప్రయాణికుడు ఇంటి వద్ద నుండి మెట్రో రైల్ స్టేషన్ వరకు, మెట్రో రైల్ స్టేషన్ నుండి తాను పని చేసే కేంద్రం సమీప స్టేషన్‌కు, అక్కడి నుండి వారు పనిచేసే కేంద్రానికి మూడు విడతలుగా ప్రయాణం చేస్తున్నారని, దీంతో అధిక వ్యయప్రయాసలకు గురవుతున్నారని చెప్పారు. సాంకేతికత ఉపయోగం ద్వారా ఈ మెట్రో ఆర్టీసీ కామన్ బస్సు పాస్‌లను ప్రారంభించామని వెల్లడించారు. ఆటో సర్వీసులను కూడా ఈ కామన్ పాస్ పరిధిలోకి తీసుకొచ్చే ప్రయత్నాలను చేపట్టామన్నారు. రానున్న కాలంలో ఆర్టీసీ, హైదరాబాద్ మెట్రో సర్వీసులను మరింత పటిష్టం చేసి ప్రయాణికులకు సౌకర్యవంతం చేస్తామని తెలిపారు. మీ సేవ కేంద్రాల ద్వారా కూడా మెట్రో రైల్ ఆర్టీసీ కామన్ బస్సు పాస్‌లను జారీ చేస్తామని తెలిపారు.

# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

- **19వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు**
- **కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందం**
- **ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి**

**హైదారాబాద్, అక్టోబర్ 2:**
రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందిం చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్ స్టేషన్లలోని లాగ్ బుక్ లను తనిఖీ చేసినప్పుడు కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు.



నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి ఐదువేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# గాంధీయిజమే ప్రపంచానికి మార్గదర్శకం

**హైదరాబాద్, అక్టోబర్ 2 :**
అహింస, సత్యాగ్రహం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి మహాత్మా గాంధీ ఆలోచనలే ప్రపంచానికి మార్గదర్శకాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గాంధీజీ చూపిన మార్గంలోనే అసమానతలు, వివక్ష, అవమానాలు లేని సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఎల్బీ స్టేడియంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, టీపీసీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భట్టి విక్రమార్క ప్రసంగించారు. గాంధీజీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సే భావజాలాన్ని సమర్థించే ధోరణులు దేశంలో కనిపించడం బాధాకరమన్నారు. గాంధీని విమర్శిస్తూ గాడ్సే విధానాలే సరైనవని మాట్లాడే సంస్కృతిని దేశభక్తులెవరూ అంగీకరించరాదన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ నాయకత్వం, సత్యాగ్రహం, అహింసా సిద్ధాంతాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గాంధీతో కలిసి నడవని, ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమంతో సంబంధం లేని బీజేపీ నాయకులు నేడు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. దక్షిణాఫ్రికాలో ఎదురైన అవమానం గాంధీజీ జీవితంలో కీలక మలుపుగా మారిందని చెప్పారు. చంపారన్ సత్యాగ్రహం నుంచి దండి సత్యాగ్రహం వరకు సామాన్య ప్రజల సమస్యలను ఉద్యమాలకు కేంద్రంగా మార్చారన్నారు. గుప్పెడు ఉప్పుతో, చిన్న నూలు పోగుతో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి సవాల్ విసిరిన మహాత్ముడు ప్రజల శక్తిని ప్రపంచానికి చాటారని పేర్కొన్నారు.

**సమానావకాశాలు కల్పించడమే ప్రజా పాలన లక్ష్యం**

గాంధీజీ ఆలోచనల స్ఫూర్తితోనే ప్రజల అవసరాలను గుర్తించి వారికి అనుగుణంగా విధానాలను ప్రజా ప్రభుత్వం రూపొందిస్తున్నదని తెలిపారు. ప్రజలందరికీ సమానావకాశాలు, విద్య, సామాజిక గౌరవం కల్పించడమే ప్రజా పాలన లక్ష్యమన్నారు. ఈ ఆలోచనలకు అనుగుణంగానే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. కులం, మతం, వర్గం అనే భేదాలు లేకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులు కలిసి చదువుకునేలా ఈ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

**గాంధీ ఆలోచనలే సామాజిక సమానత్వానికి పునాది**

స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే గాంధీజీ సామాజిక అసమానతలు, అంటరానితనానికి వ్యతిరేకంగా కూడా ఉద్యమించారని చెప్పారు. సమాజంలో వెనుకబడిన వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి ఆయన కృషి చేశారని తెలిపారు. హిందూముస్లిం ఐక్యతను బలోపేతం చేసి స్వాతంత్ర్య ఉద్యమాన్ని విస్తృత ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దారని చెప్పారు.



గాంధీ, నెహ్రూ తదితర జాతీయ నాయకులు వేసిన పునాదుల వల్లే స్వతంత్ర దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం వంటి రంగాల్లో పురోగతి సాధ్యమైందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తొలుత భట్టి విక్రమార్కకు గాంధీ వేషధారణలో ఉన్న చిన్నారులు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్‌స్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, గడ్డం వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**గాంధీ భవన్‌లో..**

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) ఆధ్వర్యంలో నాంపల్లిలోని గాంధీ భవన్‌లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్కడ ఉన్న గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, రవాణా, మైనారిటీ సంక్షేమ శాఖ, కార్మిక శాఖ మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, గడ్డం వివేకానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా భవన్‌లో గాంధీకి నివాళులు**

ప్రజా భవన్‌ల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పూల మాలలు వేసి నివాళులర్పించారు. కోపం కంటే శాంతిని, విభేదాల కంటే మంచితనాన్ని, నిర్లక్ష్యం కంటే కరుణను ఎంచుకుందామని పిలుపునిచ్చారు. నిజమైన ప్రగతి పట్టుదలతో, సహనంతో సాధ్యమవుతుందని, ఆ ప్రగతి అందరినీ కలుపుకుని ముందుకు సాగాలని అన్నారు. ప్రతి మనిషికి గౌరవం, మర్యాద, మానవత్వం దక్కే సమాజమే మహాత్మా గాంధీకి మనం అందించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.

# డిసెంబర్ 9 నుంచి సర్కారు బడుల్లో బ్రేక్‌ఫాస్ట్!

**హైదరాబాద్, అక్టోబర్ 2 :**
ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ అమలులో విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని, వారి శారీరక పెరుగుదల, విద్య పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులకు సూచించారు. ఆహార పదార్థాల క్యాలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలన్నారు. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లు ఒప్పందం చేసుకున్నాయి. అందుకు సంబంధించిన చెక్కులను సీఎం చేతుల మీదుగా ఆయన నివాసంలో హరేకృష్ణ ఫౌండేషన్‌కు ఆయా సంస్థల ప్రతినిధులు శుక్రవారం అందజేశారు. నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం జున్నా సోలార్ సిస్టమ్స్ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈవో అనిల్ బాబులు రూ.5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి సమంత డే, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్‌లు రూ.4 కోట్ల చెక్కును అందించగా ముఖ్యమంత్రి ఆ సంస్థల ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆహార నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయాలని, సెంట్రలైజ్డ్ కిచెన్లను విద్యార్థులు సందర్శించేలా చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు. ఇది జీవితకాలం కొనసాగే కార్యక్రమం కాబట్టి అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తామని, నవంబర్ 30లోగా ఇవి పూర్తి అయ్యేలా చూడాలని, డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రలైజ్డ్ కిచెన్ల ప్రారంభం జరుగుతుందని సీఎం తెలిపారు.

# హైదరాబాద్‌లో ఏనుగు దంతాల స్మగ్లింగ్.. ముగ్గురు అరెస్ట్

- **దంతాల మూలం, అక్రమ నెట్‌వర్క్ పై కొనసాగుతున్న దర్యాప్తు**

**హైదరాబాద్, అక్టోబర్ 2:**
నగరంలో ఏనుగు దంతాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి సుమారు 17 కిలోల బరువున్న నాలుగు ఏనుగు దంతాలతో పాటు వాటితో తయారు చేసిన ఐవరీ ట్రోఫీలను స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో నిఘా పెట్టిన అధికారులు.. దంతాలను విక్రయిస్తున్న సమయంలో నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు**

స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాలను వన్యప్రాణి సంరక్షణ చట్టం1972 నిబంధనల ప్రకారం సీజ్ చేసినట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. దంతాలు ఎక్కడి నుంచి వచ్చాయి, వీటి వెనుక ఉన్న నెట్‌వర్క్ ఎవరు, అక్రమ లావాదేవీల్లో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఏనుగు దంతాల వ్యాపారం, వాటితో తయారు చేసిన వస్తువుల విక్రయాలు, కొనుగోళ్లు చట్టవిరుద్ధమైనవని అధికారులు స్పష్టం చేశారు. వన్యప్రాణుల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో డీఆర్ఐతో పాటు అటవీ, వన్యప్రాణి సంరక్షణ విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయి.

**వన్యప్రాణుల రక్షణకు సహకరించాలి**

ఏనుగుల వేట, ముఖ్యంగా దంతాల కోసం అక్రమంగా వాటిని హతమార్చడం వన్యప్రాణుల మనుగడతో పాటు పర్యావరణ సమతుల్యతపై ప్రభావం చూపుతుంది. దంతాలు లేదా ఇతర వన్యప్రాణి ఉత్పత్తుల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే అటవీ శాఖ లేదా పోలీసులకు తెలియజేయాలని అధికారులు సూచించారు.

# 4న రాష్ట్రానికి అమిత్ షా రాక

- **తూప్రాన్‌లో అమూల్ డెయిరీ ప్లాంట్ ప్రారంభోత్సవం**
- **సబర్ డెయిరీ ప్రాజెక్టుకు భూమి పూజ**
- **కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**



**హైదరాబాద్, అక్టోబర్ 2 :**
కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ఈ నెల 4వ తేదీన రాష్ట్రంలో పర్యటించనున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లోని ఊర్జ్ ఇండస్ట్రియల్ పార్కులో ఆరోజు ఉదయం 10 గంటలకు నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. సబర్ డెయిరీ ప్రాజెక్టు భూమి పూజతోపాటు అమూల్ సంస్థ రాష్ట్రంలో అత్యంత ఆధునికంగా ఏర్పాటు చేసిన మొట్టమొదటి డెయిరీ ప్లాంట్‌ను ఆయన చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో పాడిపరిశ్రమ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతోపాటు, వాల్యూ క్రియేషన్ పెంచి పాడి రైతులకు ఆర్థికంగా చేయూతనందించడమే ఈ ప్లాంట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పాలు 5 లక్షల లీటర్లు (5 ఎలఎల్‌పీడీ), పెరుగు 200 మెట్రిక్ టన్నులు (200 ఎంటీపీడీ), మజ్జిగ అండ్ లస్సీ చెరో 30 కిలో లీటర్లు (30 కేఎల్‌పీడీ), పనీరు 10 మెట్రిక్ టన్నులు (10 ఎంటీపీడీ), ఐస్ క్రీమ్: 50 కిలో లీటర్లు (దీన్ని భవిష్యత్తులో లక్ష లీటర్ల వరకు విస్తరించే అవకాశం ఉంది), స్వీట్స్ అండ్ బేకరీ ఉత్పత్తులు రోజుకు 3 నుంచి 5 మెట్రిక్ టన్నులు, నెయ్యి 5 మెట్రిక్ టన్నులు ఈ ప్లాంటులో ఉత్పత్తి జరుగుతాయన్నారు.

**శ్వేత విప్లవం 2.0 గ్రామీణ వికాసానికి బాటలు**

కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన శ్వేత విప్లవం 2.0 ద్వారా 202829 నాటికి డెయిరీ కో ఆపరేటివ్స్ ద్వారా పాల సేకరణను 50% పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. 2029 నాటికి దేశవ్యాప్తంగా 75,000 కొత్త పాడి సహకార సంఘాలను (ఎన్‌డీసీఎస్) ఏర్పాటు చేయనుండగా ఇందులో భాగస్వామ్యంగా తెలంగాణలో 1,525 కొత్త సహకార సంఘాలను నిర్దేశించినట్లు స్పష్టం చేశారు.

**తెలంగాణకు ఎన్‌సీడీఎస్‌కు భారీ మద్దతు**

గత 12 ఏళ్లలో నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌సీడీసీ) ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి రూ.1.16 లక్షల కోట్ల సహాయం అందించినట్లు తెలిపారు. ధాన్యం(వరి) సేకరణకు 202526 సీజన్‌కు రూ.37,000 కోట్లు, 202627 రబీ సీజన్ కోసం రూ.22,700 కోట్ల రుణాన్ని మంజూరు చేసినట్లు చెప్పారు. సహకార చట్టాల విస్తరణ పార్లమెంటులో ఇటీవలే ఎన్‌సీడీసీ బిల్లు ఆమోదం పొందడంతో రిజిస్టర్డ్ కోఆపరేటివ్స్‌తోపాటు సహకార రంగంలో పనిచేసే అన్ని సంస్థలకూ నిధుల లభ్యత ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న 60వేల పైచిలుకు సహకార సంఘాల్లో 70% గ్రామీణ ప్రాంతాల్లోనే ఉండగా వాటిలో కోటిమందికి పైగా సభ్యులు ఉన్నారని, కేంద్ర ప్రభుత్వ చర్యలు రాష్ట్రంలోని రైతులకు, పాడి రైతులకు ఎంతో లబ్ది చేకూరుస్తాయని కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# గణేష్ నిమజ్జనం ముగిసింది.. జ్ఞానేష్ నిమజ్జనం మిగిలి ఉంది

- **సీఈసీ రాజీనామాపై ప్రకాష్ రాజ్**

**బెంగళూరు, అక్టోబర్ 2 :**



సీఈసీ జ్ఞానేష్ కుమార్ తొలగించాలంటూ ప్రతిపక్షాల డిమాండ్ పై సినీ నటుడు ప్రకాష్ రాజ్ స్పందించారు. దేశంలో గణేష్ నిమజ్జనం పూర్తైందని, జ్ఞానేష్ నిమజ్జనం మిగిలి ఉందని అన్నారు. 'సర్' కు వ్యతిరేకంగా, అలాగే, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ తొ ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ సహా వివిధ పక్షాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రధానంగా ఢిల్లీలో, ఆ తర్వాత ముంబైలో భారీ నిరసన కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు భారీ ఎత్తున ఈ ఆందోళనల్లో పాల్గొనాలని ప్రకాష్ రాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో రిలీజ్ చేశారు. సీఈసీని తొలగించే వరకు జరిగే ఆందోళనలకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. సీఈసీ రాజీనామా కోరుతూ సీజేపీ కూడా ఆందోళన చేపట్టనున్న సంగతి తెలిసిందే. దీనిపై కూడా ప్రకాష్ రాజ్ స్పందించారు. కాక్రోచ్‌లు వస్తున్నారు.. హ్యాపీ జయంతి అంటూ చెప్పుకొచ్చారు.



# ఢిల్లీలో నిరసనలు

- **జంతర్ మంతర్ వద్ద ధర్నాకు యత్నం**
- **సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్**
- **పలువురు ఆప్ నేతల అరెస్ట్**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 2:**

సీఈసీ జానేష్ కుమార్ రాజీనామా. కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆమ్ ఆద్మీ పార్టీ, సీపీఐఎం, ఏఐఎస్ సహా వివిధ పక్షాల నేతలు, యువత శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా 1100 మందికిపైగా కార్యకర్తలు, నేతలను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వివిధ పక్షాలకు చెందిన కీలక నేతలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆప్ కీలక నేతలు, ఢిల్లీ మాజీ సీఎం అతిషి, సౌరభ్ భరద్వాజ్, సంజీవ్ ఝా, సంజయ్ సింగ్, ఏఐఎస్ఏ ఉద్యమకారిణి నేహా బోరా, సీపీఐఎం సీనియర్ లీడర్ బృందాకారత్ సహా పలువురు నేతల్ని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వివిధ విద్యార్థి సంఘాలకు చెందిన నేతలు కూడా ఉద్యమంలో పాల్గొనేందుకు వెళ్లగా వారిని కూడా అరెస్టు చేశారు. జంతర్ మంతర్ ప్రాంతానికి వెళ్లేందుకు అనేక చోట్ల రహదారుల్ని మూసివేశారు. అయినప్పటికీ వందల మంది అక్కడకు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఉద్యమకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో 30 మందికిపైగా గాయపడ్డట్లు తెలుస్తోంది. జంతర్మంతర్ వద్దకు కీలక నేతలు వెళ్లకుండా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు.

# ఆర్మీ ఆయుధాల చోరీ వెనుక భారీ నెట్‌వర్క్

- **మల్లేష్ 10 రోజుల పోలీసు కస్టడీలో సంచలన విషయాల వెల్లడి**
- **16 ఏళ్ల సర్వీస్.. పొడిగింపు దక్కక ఆర్మీపై కక్ష పెంచుకున్నట్లు విచారణలో వెల్లడి**
- **వెబ్‌సిరీస్‌లు, దోపిడీ వీడియోలతో చోరీకి స్కెచ్**
- **రెక్కీ చేసి ఆయుధాలు చోరీ.. నాగర్‌కర్నూల్‌లోని ఇంటికి తరలింపు**
- **కలకత్తా కేంద్రంగా సాగుతున్న అక్రమ ఆయుధాల నెట్‌వర్క్‌పై పోలీసుల దృష్టి**

**హైదరాబాద్, అక్టోబర్ 2:**

సికింద్రాబాద్‌లోని మద్రాస్ రెజిమెంట్ సెంటర్‌లో జరిగిన ఆర్మీ ఆయుధాల చోరీ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు కస్టడీలోకి తీసుకున్న నిందితుడు మల్లేష్ 10 రోజుల విచారణలో ఇచ్చిన కన్ఫెషన్ స్టేట్‌మెంట్ ఆధారంగా చోరీ వెనుక ఉన్న ప్రణాళిక, ఆయుధాల తరలింపు, అక్రమ విక్రయానికి సంబంధించిన వివరాలను పోలీసులు సేకరించారు. 2009లో ఆర్మీలో చేరిన మల్లేష్‌కు ఆయుధాలు, మందుగుండు సామాగ్రి వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఉంది. వివిధ కంటోన్మెంట్లలో పనిచేసిన సమయంలో ఆయుధాగారాల నిర్వహణకు సంబంధించిన బాధ్యతలు కూడా నిర్వర్తించాడు. అయితే విధుల్లో నిర్లక్ష్యానికి పలుమార్లు క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొన్నట్లు అధికారులు గుర్తించారు. 16 ఏళ్ల సర్వీస్ అనంతరం మరో మూడేళ్ల పొడిగింపు దక్కకపోవడంతో ఆర్మీపై అసంతృప్తి పెంచుకున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

**నేర చరిత్ర.. వెబ్‌సిరీస్‌లతో ప్రేరణ**

మల్లేష్‌కు గతంలోనే నేరచరిత్ర ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు. 2007లో ఆమ్రాబాద్, అచ్చంపేట ప్రాంతాల్లో నమోదైన ఇళ్ల దొంగతనం కేసుల్లో అతడు నిందితుడిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. 2022లో కలకత్తా బ్యారక్‌పూర్‌లో పనిచేస్తున్న సమయంలో బీర్బల్ షా అనే వ్యక్తి ద్వారా అక్రమ ఆయుధాల వ్యాపారి అవల్ దెయ్ అలియాస్ ఓబీతో పరిచయం ఏర్పడినట్లు విచారణలో వెల్లడైంది. వారి నుంచి రూ.10 వేలకు తుపాకీ కొనుగోలు చేసి దారి దోపిడీకి ప్రయత్నించినప్పటికీ అది విఫలమైందని పోలీసులు తెలిపారు. అనంతరం ఆ తుపాకీని స్వగ్రామంలో దాచినట్లు వెల్లడించారు. 2025లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో ఆర్మీ నుంచే ఆయుధాలు చోరీ చేయాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో చెప్పినట్లు పోలీసులు తెలిపారు. క్రైమ్ వెబ్‌సిరీస్‌లు, బ్యాంకులు, బంగారు దుకాణాల దోపిడీలకు సంబంధించిన వీడియోలను పరిశీలిస్తూ చోరీకి ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడైంది.

**రెక్కీ చేసి.. ఆయుధాల తరలింపు**

చోరీకి ముందు జూలై 2026లో మద్రాస్ రెజిమెంట్ సెంటర్‌లో మల్లేష్ పలుమార్లు రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. శేషులు, ప్రవీణ్, వినోద్ సహకారంతో సీసీ కెమెరాలు, విద్యుత్ దీపాల ఏర్పాటు, జవాన్ల కదలికల సమయాలను పరిశీలించినట్లు విచారణలో తేలింది. పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేసిన అనంతరం యాక్టివా స్కూటర్, బ్రీజా కారులో నాగర్‌కర్నూల్‌లోని తన ఇంటికి తరలించినట్లు మల్లేష్ వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన ఆయుధాలను బీర్బల్ షా ద్వారా అవల్ దెయ్‌కు విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

# ముంబైలో పోటాపోటీ నిరసనలు

- **సీఈసీ రాజీనామా డిమాండ్ చేస్తూ సీజేపీ ఆందోళన**
- **సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్' ఆందోళన**

**ముంబై, అక్టోబర్ 2:**



ముంబైలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీ నామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఓ వైపు నిరసనలు చేపట్టగా మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ముంబై' బృందం ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ జయంతి సందర్భంగా సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, ముంబై లోని శివాజీ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. తమ నిరసనకు ప్రజలు మద్దతు ప్రకటించాలని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ విజ్ఞప్తి చేశారు. వీరికి ప్రతిగా జెన్ నెక్టస్ ముంబై సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు చేపట్టారు. ఈ సందర్భంగా ఒక నిరసనకారుడు మాట్లాడుతూ 'అభిజీత్ దీప్కే వంటి వ్యక్తులు రాజ్యాంగాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారు. కానీ రాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో, ఎలా గౌరవించాలో మాకు తెలుసు.. అందుకే మేం అంటేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నాం.. సీజేపీ వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం' అని స్పష్టం చేశారు. ఈ పోటాపోటీ ప్రదర్శనల ప్రభావంతో సోషల్ మీడియాలోనూ ఇరు వర్గాల మద్దతుదారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు జెన్ నెక్ట్స్ మద్దతుదారులు సీజేపీ సభ్యులను దిమాగీ నక్సల్స్ గా అభివర్ణించగా, జెన్ నెక్ట్స్ నిరసనల వెనుక బీజేపీ హస్తం ఉందని సీజేపీ వర్గాలు ఆరోపించాయి. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు, భద్రతా బలగాలు భారీగా మోహరించాయి.

# సీఈసీపై కాంగ్రెస్ సమరం.. రోడ్డెక్కనున్న ఇండియా కూటమి

- **జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు సీడబ్ల్యూసీ డిమాండ్**
- **ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలతో పార్లమెంట్ నుంచి వీధుల వరకు పోరాటానికి నిర్ణయం**
- **ఇండియా కూటమి పార్టీలతో కలిసి దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపు**
- **అక్టోబర్ 2 నుంచి 8 వరకు 'సేవ్ డెమోక్రసీ' మార్చ్‌లు**
- **అక్టోబర్ 6న ఎన్నికల సంఘం కార్యాలయానికి విపక్ష ఎంపీల మార్చ్**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 2:**



ఎన్నికల సంఘం స్వతంత్రత, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ చేపట్టిన పోరాటం మరింత తీవ్ర రూపం దాల్చింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేయడంతోపాటు.. ఈ అంశాన్ని పార్లమెంట్‌తో పాటు ప్రజాక్షేత్రంలోనూ ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది. సెప్టెంబర్ 29న జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసిన కాంగ్రెస్.. అనంతరం ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణకు సిద్ధమైంది.

**ప్రజా ఉద్యమానికి పిలుపు**

ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ కొంతకాలంగా ఆరోపణలు చేస్తోంది. ముఖ్యంగా ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల జాబితాల్లో పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించారన్నది ఆ పార్టీ ప్రధాన ఆరోపణ. సీడబ్ల్యూసీ సమావేశంలో ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని, తొలగించిన పేర్లను పునరుద్ధరించాలని కూడా డిమాండ్ చేసింది. అయితే ఎన్నికల సంఘం మాత్రం తన చర్యలు చట్టబద్ధమైనవేనని, అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం సంస్థాగత చర్చల్లో సాధారణమేనని స్పష్టం చేసింది. ఇండియా కూటమి కూడా ఈ అంశంపై ఉమ్మడి కార్యాచరణకు నిర్ణయించింది. అక్టోబర్ 2 నుంచి 8 వరకు 'సేవ్ డెమోక్రసీ' మార్చ్‌లు నిర్వహించాలని, అక్టోబర్ 6న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి మార్చ్ నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్రాలు, జిల్లాల్లో మిత్రపక్షాలతో సమన్వయం చేసుకుని ఆందోళనలు చేపట్టాలని కాంగ్రెస్ తన యూనిట్లకు సూచించింది.

**పార్లమెంట్‌లోనూ పోరాటం**

సీఈసీని పదవి నుంచి తొలగించే ప్రక్రియ రాజ్యాంగపరంగా సంక్లిష్టమైనది. సీఈసీ తొలగింపునకు పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీతో తీర్మానం ఆమోదించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, విపక్షాలు తొలగింపు ప్రక్రియకు సంబంధించిన న్యాయపరమైన మార్గాలపై కూడా చర్చిస్తున్నాయి. సీఈసీపై తొలగింపు తీర్మానం కోసం నోటీసులు ఇచ్చే అంశంపై విపక్ష వర్గాలు గతంలోనే కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం.

**ఎన్నికల సంఘం అంతర్గత విభేదాలపై చర్చ**

ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎన్నికల కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయన్న మీడియా కథనాలు కూడా ఈ వివాదానికి మరింత ప్రాధాన్యం తెచ్చాయి. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు సందర్భాల్లో కొన్ని నిర్ణయాలు, ఆదేశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన నివేదికల నేపథ్యంలో కాంగ్రెస్ సీఈసీపై విమర్శలను మరింత తీవ్రం చేసింది. అయితే ఎన్నికల సంఘం మాత్రం నిర్ణయాలన్నీ చట్టపరమైన విధానాలను అనుసరించే తీసుకున్నవేనని చెబుతోంది. ఇక కాంగ్రెస్ సీఈసీపై పోరాటాన్ని కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ఇండియా కూటమి ద్వారా విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. పార్లమెంట్, న్యాయస్థానాలు, ప్రజాక్షేత్రంలో పోరాటం కొనసాగిస్తామని పార్టీ ఇప్పటికే ప్రకటించింది. దీంతో జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్, విపక్షాల ఆందోళన రానున్న రోజుల్లో మరింత ఉధృతమయ్యే అవకాశముంది.

# పరిశుభ్రత ప్రభుత్వాల బాధ్యతే కాదు

- **'స్వచ్ఛతా హి సేవా'లో పాల్గొన్న రామచందర్ రావు**
- **మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిలకు ఘన నివాళులు**

**హైదరాబాద్, అక్టోబర్ 2 :**

పరిశుభ్రత అనేది ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడూ ఇందులో భాగస్వామి కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆ మహనీయుల చిత్రపటాలకు శుక్రవారం పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సికింద్రాబాద్ చిలకలగూడ పరిధిలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా చేపట్టిన అతిపెద్ద కార్యక్రమాల్లో 'స్వచ్ఛ భారత్' ముఖ్యమైనదని గుర్తు చేశారు. పరిశుభ్రమైన సమాజం ఉండాలన్నది గాంధీజీ జీవితాశయమని, ఆ ఆశయాన్ని నిజం చేస్తూ ప్రధాని మోదీ స్వచ్ఛ భారత్ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. మన ఇళ్లతోపాటు వీధులు, ఊళ్లను కూడా శుభ్రం గా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలన్నారు. మనమందరం కలిసికట్టుగా చేసే ఈ చిన్న ప్రయత్నాలతోనే మన దేశం మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యంగా, అందంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీకి, జై జవాన్ - జై కిసాన్ నినాదంతో దేశాన్ని నడిపించిన మహనీయుడు లాల్ బహదూర్ శాస్త్రికి తన హృదయపూర్వక నివాళులర్పిస్తున్నట్లు రామచందర్‌రావు తెలిపారు.

**సీనియర్ సిటిజన్లు సమాజానికి పెద్ద బలం**

ఎన్నో ఏళ్లుగా సంపాదించిన తెలివితేటలు, అనుభవం వల్ల సీనియర్ సిటిజన్లు సమాజానికి ఒక గొప్ప బలం, మంచి ఆస్తి అని రామచందర్ రావు అన్నారు. దోమలగూడలోని ఏ.వి. కాలేజీలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన 23వ సీనియర్ సిటిజన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్మెంట్ అంటే సమాజం నుంచి తప్పుకోవడం కాదు.. ఏ రంగంలో పనిచేసినా దశాబ్దాలపాటు సంపాదించిన అనుభవానికి రిటైర్మెంట్ ఉండదు.. ఆ అనుభవాన్ని యువతరంతో పంచుకోవాలి., సమాజానికి తిరిగి ఇవ్వాలి అన్నారు. కుటుంబాలకు, సమాజానికి, దేశానికి సీనియర్ సిటిజన్లు ఎప్పుడూ మంచి దారి చూపే మార్గదర్శకులుగా ఉంటారని చెప్పారు. ప్రజలకు సామాజిక, ఆర్థిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన అటల్ పెన్షన్ యోజన వంటివాటిని ఆయన గుర్తు చేశారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని విస్తరించడం వల్ల పేద, ధనిక అనే తేడా లేకుండా 70 ఏళ్లు దాటిన ప్రతి సీనియర్ సిటిజన్‌కు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య బీమా అందుతోందని తెలిపారు.

# కెప్టెన్ స్మిత్ ధైర్యానికి మోదీ ప్రశంసలు

- **ఫ్లైదుబాయ్ ఘటనపై కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో ప్రధాని ఫోన్‌లో సంభాషణ**
- **కోపైలట్ దాడిలో గాయపడినా విమానాన్ని కాపాడిన పైలట్**
- **కీలక సమయంలో తీసుకున్న నిర్ణయం ఎన్నో ప్రాణాలను కాపాడిందన్న మోదీ**
- **''భారతీయులు ప్రాణాలు తీసేవారు కాదు.. ప్రాణాలు కాపాడేవారు'' అని ప్రశంస**
- **తనకు ప్రధాని మోదీయే ఆదర్శమన్న కెప్టెన్ స్మిత్ మచ్చర్**

**హైదరాబాద్, అక్టోబర్ 2:**



ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో కోపైలట్ దాడికి గురై తీవ్రంగా గాయపడినా, విమానాన్ని అదుపులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మోదీ.. ప్రమాద సమయంలో చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, సంయమనాన్ని అభినందించారు. ప్రాణాలను పణంగా పెట్టి ఇతరులను కాపాడేందుకు భారతీయులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని పేర్కొన్నారు.

''కీలక సమయంలో మీరు తీసుకున్న నిర్ణయం ఎన్నో ప్రాణాలను కాపాడింది. 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని మీరు మరింత పెంచారు. కోపైలట్ దాడిలో నెత్తురోడుతున్నా తోటి ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు మీరు చూపిన సాహసం అభినందనీయం. అహింస అంటే ఏమిటో ప్రపంచానికి చేసి చూపించారు. మీకు అవసరమైనప్పుడు ఒక ఫోన్‌కాల్ దూరంలోనే ఉంటా. మీరు త్వరగా కోలుకోవాలని దేశమంతా ప్రార్థిస్తోంది'' అని మోదీ అన్నారు.

**మోదీయే తనకు ఆదర్శమన్న స్మిత్**

విమానంలో చోటుచేసుకున్న పరిణామాలను మోదీకి వివరిస్తూ కెప్టెన్ స్మిత్ భావోద్వేగానికి లోనయ్యారు. 11 ఏళ్లుగా కెప్టెన్‌గా పనిచేస్తున్నానని, విమానంలో ఏం జరుగుతుందో వెంటనే గుర్తించగలిగే అనుభవం తనకు ఉందని తెలిపారు. ప్రమాద సమయంలో తీవ్ర గాయాలతో కిందపడిపోయిన తనకు విమానం వేగంగా కిందికి వెళ్తున్న విషయం అర్థమైందన్నారు. ఏదైనా చేయకపోతే ప్రమాదం తప్పదని గుర్తించి, గాయాలను లెక్కచేయకుండా లేచి కాక్‌పిట్ తలుపు తెరిచినట్లు చెప్పారు. సాధారణంగా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు హనుమాన్ చాలీసా పఠిస్తానని, ఆ సమయంలోనూ అదే చేశానని తెలిపారు. దేవుడే తనను కాపాడాడని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఇతరులు కాక్‌పిట్‌లోకి వచ్చి ప్రమాదాన్ని నివారించడంలో సహకరించారని వివరించారు.

తనను ప్రధాని మోదీ ఫోన్‌లో పరామర్శించడం ఎంతో ప్రత్యేకమైన విషయమని స్మిత్ పేర్కొన్నారు. ''మీరే నాకు ఆదర్శం. మీతో మాట్లాడే అవకాశం లభిస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. ఇది నాకెంతో ప్రత్యేకమైన క్షణం'' అని అన్నారు.

**ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు**

కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యసాహసాలపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సైతం ఆయనను నిజమైన హీరోగా అభివర్ణించారు. ఈ ఘటనలో పెద్ద విషాదాన్ని నివారించడంలో స్మిత్ కీలకంగా వ్యవహరించారని మోదీ గురువారం ప్రశంసించారు. ఇదిలా ఉండగా, కోపైలట్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రమాద సమయంలో విమానంలో చోటుచేసుకున్న పరిణామాలకు సంబంధించిన కొత్త వీడియో ఫుటేజ్ వెలుగులోకి వచ్చింది. ఇజ్రాయెల్‌కు చెందిన ఓ మీడియా సంస్థ ఈ దృశ్యాలను విడుదల చేసింది. కోపైలట్ తీవ్రవాద ఇస్లామిక్ భావజాల బోధనలకు ప్రభావితమైనట్లు నెతన్యాహు పేర్కొన్న నేపథ్యంలో దర్యాప్తు కొనసాగుతోంది.

# అప్రకటిత విద్యుత్ కోతలతో రైతుల జీవితాలతో చెలగాటం ..

**48 గంటల్లో సమస్య పరిష్కరించాలి: కొండపల్లి శ్రీధర్ రెడ్డి**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పాలేరు నియోజకవర్గం, నేలకొండపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ (AE) కార్యాలయం ఎదుట రైతులతో కలిసి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి పాల్గొని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

**వరంగల్ డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయి?**

ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. "వరంగల్ డిక్లరేషన్ పేరుతో రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రైతులకు నాణ్యమైన విద్యుత్ కూడా అందించలేని దుస్థితికి చేరింది. ఒకవైపు వర్షాభావ పరిస్థితులతో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతుంటే, మరోవైపు అప్రకటిత విద్యుత్ కోతలు రైతుల కష్టాలను మరింత పెంచుతున్నాయి" అని మండిపడ్డారు. "రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు గంటల తరబడి కోతలు విధిస్తూ పంటలను ఎండబెట్టే పరిస్థితి తీసుకొచ్చారు. ఇది రైతు వ్యతిరేక వైఖరికి నిదర్శనం" అని విమర్శించారు.

**"12 గంటలు ఇస్తున్నాం" అంటే ఏ గ్రామంలో చెప్పగలరు? - ఏఈ తో వాగ్వాదం**

నిరసన సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ తో శ్రీధర్ రెడ్డి ఫోన్ లో మాట్లాడారు. "రైతులకు 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నాం" అని ఏఈ చెప్పడంతో శ్రీధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు."12 గంటలు కరెంటు ఇస్తున్నామని చెబుతున్నారు, మండలంలోని ఏ గ్రామానికైనా వెళ్లి రైతుల సమక్షంలో ఇదే మాట చెప్పండి. రైతుల ముందే వాస్తవ పరిస్థితి ఏమిటో మాట్లాడుకుందాం" అంటూ నిలదీశారు. దీనిపై స్పందించిన ఏఈ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దుతామని హామీ ఇచ్చారు.

**మంత్రి నియోజకవర్గంలోనే కరెంటు లేదు - సిగ్గుచేటు**

పాలేరుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గంలోనే రైతులకు విద్యుత్ సక్రమంగా అందకపోవడం సిగ్గుచేటని అన్నారు. జిల్లాలో ముగ్గురు కీలక మంత్రులు ఉన్నా రైతులకు కరెంటు ఇవ్వలేకపోవడం కాంగ్రెస్ పాలనా వైఫల్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.

**48 గంటల అల్టిమేటం**

అప్రకటిత కోతలపై ప్రభుత్వం 48 గంటల్లో సమీక్ష నిర్వహించి, రైతులకు నిరంతర విద్యుత్ పై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గల్లా సత్యనారాయణ, బీజేవైఎం రాష్ట్ర నాయకులు అనంత ఉపేందర్ గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చావా కిరణ్, పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్ రెడ్డి, మండల అధ్యక్షుడు సుధాకర్, మన్నే కృష్ణారావు, గోవిందరావు, జ్ఞానరత్నం, కెమెరా ఉపేందర్, మల్లేష్, పురాణం దివాకర్, కందనబోయిన వెంకటరమణ, రామకృష్ణ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్న యూనియన్ టి డబ్లు జే ఎఫ్ మామిడి సోమయ్య నాయకత్వంలో పోరుబాట

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** జర్నలిస్టుల సమస్యలను తమ సొంత సమస్యలుగా భావించి నాటి నుండి నేటి వరకు నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక యూనియన్ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (TWJF) అని ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్ పేర్కొన్నారు.రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కుల కోసం గల్లీ నుండి ఢిల్లీ జంతర్ మంతర్ వరకు ఉద్యమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, కేబుల్ టీవీ అక్రిడిటేషన్ కార్డుల కోసం ఇప్పటివరకు ఏడు సార్లు టి డబ్ల్యూ జె ఎఫ్ హెచ్-2843 ఆధ్వర్యంలో I&PR కార్యాలయాన్ని ముట్టడించామని గుర్తు చేశారు.అలాగే జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం పలువురు రాజకీయ నాయకులను, వివిధ శాఖల అధికారులను కలిసి వినతి పత్రాలు ఇచ్చిన ఘనత TWJF కే దక్కుతుందన్నారు. బస్ పాస్ విషయంలో 1/3 నుండి 50 శాతానికి మార్పు జరిగిన సమయంలోనూ సమస్యను గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించి జర్నలిస్టుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు."జర్నలిస్టు సమస్య అంటే మా సొంత ఇంటి సమస్యే. జర్నలిస్టుల సంక్షేమం మాటల్లో కాదు, చేతల్లో చూపాలి. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగించడమే మా విధానం" అని నాయకులు స్పష్టం చేశారు. "జర్నలిస్టుల హక్కులు సాధించే వరకు రాజీ లేదు, సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆగదు" అనే నినాదంతో ఫెడరేషన్ ముందుకు సాగుతుందని వారు తెలిపారు.




# వివక్షత లేని సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం



**కెవిపిఎస్ పాలేరు డివిజన్ అధ్యక్షులు పగిడికత్తుల నాగేశ్వరరావు**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** వివక్షత లేని సమాజ నిర్మాణానికి అందరం కలిసి కృషి చేద్దామని కెవిపిఎస్ పాలేరు డివిజన్ అధ్యక్షులు పగిడికత్తుల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (KVPS) 29వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జెండాను ఆయన ఆవిష్కరించారు.అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కుల వివక్షకు వ్యతిరేకంగా విశాల ప్రజా ఐక్యతను నిర్మించేందుకు కెవిపిఎస్ ఏర్పడిందని, 1998 అక్టోబర్ 2న ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాలతో ఆవిర్భవించిందని తెలిపారు.అట్టడుగు వర్గాల సమస్యలను ఒక కులానికి పరిమితం చేయకుండా, కుల ఆధిపత్యం, అంటరానితనం ఏ రూపంలో ఉన్నా దానికి వ్యతిరేకంగా కెవిపిఎస్ పోరాడుతుందన్నారు.నేటికీ అనేక గ్రామాల్లో దేవాలయాల్లోకి దళితులకు ప్రవేశం లేదని, పండుగల సందర్భంలో వివక్ష చూపిస్తున్నారని, దళిత మహిళలు వండిన మధ్యాహ్న భోజనం తినడానికి నిరాకరిస్తున్నారని, దళితులు చనిపోతే స్మశాన వాటికలో చోటు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా కెవిపిఎస్ సర్వేలో 62 రకాల వివక్షత రూపాలను గుర్తించిందని, వాటి నిర్మూలన కోసం అనేక ప్రజా పోరాటాలు, ఆందోళనలు నిర్వహించి విజయాలు సాధించిందన్నారు. కుల నిర్మూలన దిశగా ప్రజలందరినీ కలుపుకొని ముందుకు సాగడమే ఆవిర్భావ దినోత్సవానికి అసలైన స్ఫూర్తి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు వంగూరు సుధాకర్, పొట్టపెంజర భాస్కర్, పగిడికత్తుల నవీన్, పగిడికత్తుల కళ్యాణ్, భూక్య వినయ్, బొడ్డు ఉపేందర్, కుక్కల ప్రకాష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పిండిప్రోలులో రసాభాసగా గ్రామసభ

**ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు గ్రామం లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, కమిటీల పనితీరుపై పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు అధికారులను ప్రశ్నించడంతో అధికార, ప్రతిపక్ష వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామపంచాయతీకి సరైన సమాచారం, ప్రమేయం లేకుండా ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఎలా జరుగుతుందని పాలకవర్గ సభ్యులు ప్రశ్నించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గ్రామసభకు హాజరైన ఏపీవో అప్పారావు గ్రామ సభ నుండి మధ్యలోనే వెళ్లిపోయారు గ్రామసభను రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిర్వహించాలని గ్రామస్థులు కోరారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించి, అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కామల్ల సువార్త, ఉపసర్పంచ్ చామకూరి రాజ్‌కుమార్, ఏపీవో అప్పారావు, పంచాయతీ కార్యదర్శి మాధవి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# సత్యం, అహింస మార్గాలు నేటికీ ఆదర్శం

**శ్రీరామ్ నగర్ ఏ బ్లాక్ లో లో గాంధీ జయంతి వేడుకలు**

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** శ్రీరామ్ నగర్ కాలనీ ఏ-బ్లాక్ లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బలరాం యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రపంచానికి చాటిన గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమాజంలో ఐక్యత, సోదరభావం నెలకొల్పేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాంధీజీ చూపిన మార్గం నేటి సమాజానికి ఎంతో అవసరమని, యువత ఆయన జీవిత చరిత్రను తెలుసుకుని ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని వక్తలు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాజమౌళి రావు, సోమయ్య, వెంకటేశ్వర్లు, దామోదర్ రావు, వెంకటయ్య, నగేష్, మాలకొండయ్య, రవీందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, ఈరన్న, మహమ్మద్, నాగరాజు, అశోక్, కేదార్, సాయి, సత్యనారాయణ, ప్రేమ్, సాయి చరణ్, బిట్టు, తరుణ్, తిరుమల తదితరులు పాల్గొన్నారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పించారు.



## ఘనంగా మహాత్మాగాంధీ జయంతి వేడుకలు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం కొత్త కొత్తూరు గ్రామంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల ఎ ఎం సి చైర్మన్ వెన్నపూసల సీతారాములు ముఖ్య అతిథిగా పాల్గొని మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలికూర నాగరాజు, కొత్తూరు సర్పంచ్ మాలవత్ కవిత, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, పాలేరు నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు జెరిపోతుల సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేలకొండపల్లిలో ఘనంగా గాంధీ జయంతి



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దయా హృదయులు, పాలేరు మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి అందించిన ట్రై సైకిల్ ను ముజ్జిగూడెం గ్రామానికి చెందిన వికలాంగురాలు వేముల నాగమణికి ఉన్నం బ్రహ్మయ్య చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు మెడికల్ కిట్లు పంపిణీ

**గాంధీ జయంతి, మాజీ కౌన్సిలర్ శ్రీశైలం గౌడ్ జన్మదినం సందర్భంగా మెడికల్ కిట్లు, అన్నదానం**



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని, అలాగే మూసాపేట్ మాజీ కౌన్సిలర్ రామారం శ్రీశైలం గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన నివాసంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి మెడికల్ కిట్లను అందజేయడంతో పాటు, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సప్పిడి శ్రీనివాస్ రావు, కర్క పెంటయ్య, గాజుల మహేష్ గౌడ్, ఎమ్మార్పీఎస్ లాజరస్, బాశెట్టి నర్సింగరావు, రామారం రాము గౌడ్, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొని శ్రీశైలం గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం సమాజ హితం కోసం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికులను గుర్తించి వారికి అండగా నిలవడం అభినందనీయమని నేతలు కొనియాడారు.

## సంక్షేమ హాస్టళ్లపై అధికారుల ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచన
- ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్
- గ్రామ సర్పంచ్ ధారావత్ సుజాత నరసింహారావు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** తిరుమలాయపాలెం గ్రామంలోని సంక్షేమ హాస్టళ్లను ఎంపీడీవో షేక్ సిల్వర్ సాహెబ్, గ్రామ సర్పంచ్ దారావత్ సుజాత నరసింహారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ బాలికల వసతి గృహం, గిరిజన గురుకుల బాలుర వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అధికారులు మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, వసతి, భోజన నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పంచాయతీ కార్యదర్శి, రమేష్ ఏఎన్ఎం నాగలక్ష్మి ఆశా కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ధరావత్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలిమ్ ఎంబీ చర్చిలో ఘనంగా 'రైస్ అప్' యూత్ రిట్రీట్




**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** బాలానగర్‌లోని ఎలిమ్ ఎంబీ చర్చిలో ఈఎంబీసీ యూత్ ఆధ్వర్యంలో 'రైస్ అప్' యూత్ రిట్రీట్ వేడుకలు వైభవంగా జరిగాయి. స్తుతి ఆరాధనలతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ కూడికకు పాస్టర్ ఎర్నెస్ట్ మోహంతి, మైనారిటీ సభ్యురాలు టి. ప్రవీణ, న్యాయనిర్ణేతలు దినకర్, నిర్మల దినకర్ అధ్యక్షత వహించారు. చర్చి పాస్టర్ రెవ. జి.కె. ప్రసాద్ మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు యువతలో క్రమశిక్షణ, నైతిక విలువలు, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ముఖ్య వక్త పాస్టర్ ఎర్నెస్ట్ మోహంతి యువత ఎదుర్కొనే సవాళ్లకు బైబిల్ ఆధారిత పరిష్కారాలను వివరిస్తూ దైవ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బైబిల్ క్విజ్, పాటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. చర్చి కమిటీ బాధ్యులు, నిర్వాహకులకు ధన్యవాదాలు తెలపడంతో పాటు ముగింపు ప్రార్థనతో ఈ వేడుకలు ఘనంగా ముగిశాయి.

## గ్రామాభివృద్ధి పనులపై పల్లెర్లలో గ్రామసభ



**ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం). మండలం పల్లెర్ల గ్రామంలోమహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని పల్లెర్ల గ్రామపంచాయతీలో సర్పంచ్ తండ మంజుల నరసింహ గౌడ్ అధ్యక్షతన VB-G RAM(G) పథకం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2026-27, 2027-28 ఆర్థిక సంవత్సరాల్లో గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి, వాటిపై గ్రామసభలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కానుకుంట్ల సారయ్య, తాజా మాజీ జడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి తండ బాల్‌రాజు, ఏపీఓ బోడిగే రమేష్, వ్యవసాయ ఏఈఓ అశోక్, సంఘబంధం అధ్యక్షురాలు, ఫీల్ అసిస్టెంట్ గుర్రం సురేష్, వీవీకేలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## డాక్టరేట్ సాధించిన కప్రాయిపల్లి వాసి దాశమ్మ



**ఆత్మకూర్ (ఎం).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆత్మకూర్( ఎం) మండలంలోని కప్రాయిపల్లి గ్రామానికి చెందిన బుంగ దాశమ్మ. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు. విశ్వవిద్యాలయ చరిత్ర విభాగం ప్రొఫెసర్ బి. లావణ్య పర్యవేక్షణలో "తెలంగాణ రాష్ట్ర జానపద కళలు మరియు చేతివృత్తులు - ప్రాచీన, ఆధునిక పర్యాటక ఉత్పాదనగా విశ్లేషణ" అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించినందుకు గాను దాశమ్మకు ఈ డాక్టరేట్ లభించింది. ఈ పరిశోధనలో తనకు సహకారాన్ని అందించిన పర్యవేక్షకులు ప్రొఫెసర్ బి. లావణ్యకు, తన తల్లిదండ్రులు బుంగ వెంకయ్య, మాణెమ్మలకు, సోదరులు పరశురాములు, అశోక్‌లకు దాశమ్మ ధన్యవాదాలు తెలిపారు. గ్రామీణ ప్రాంతమైన కప్రాయిపల్లి నుండి డాక్టరేట్ సాధించిన దాశమ్మకు పరిశోధకులు, విద్యావేత్తలు, బంధుమిత్రులు క ప్రాయిపల్లి గ్రామ ప్రజలు అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.

## గ్రామ గ్రామాన గాంధీ జయంతి వేడుకలు గ్రామసభలు



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను సర్పంచ్ ల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్లు మాట్లాడుతూ గాంధీజీ సత్యం, అహింస సిద్ధాంతాలను ప్రజాజీవితానికి మార్గదర్శకంగా నిలిపారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సహాయ నిరాకరణ, విదేశీ వస్త్ర బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాల ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను నేటి తరం ఆచరించాలని సూచించారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామసభలకు ప్రజలు హాజరై తమ సమస్యలు, అవసరాలు, అభివృద్ధి ప్రతిపాదనలను తెలియజేయాలని సర్పంచ్ కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామ అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా, తాసిల్దార్ ఉమలత, ఎస్సై మురళి, అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, పాలకవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయికి బయలుదేరిన బాలుర బాలికల టీమ్స్



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కబడ్డి బాలుర, బాలికలు ఎంపిక అయ్యారు. కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. రాజు ఆధ్వర్యంలో చైర్మన్ జి. భాస్కర్, ప్రెసిడెంట్ బి. భాస్కర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్యామ్ రావు, ట్రెజరర్ N. శ్రీనివాస్ రెడ్డి , జైన్ సెక్రటరీ పి .జగదీశ్వర్ , ఆర్గనై సెక్రటరీ ఎస్. నగేష్, అసోసియేషన్ కమిటీ సభ్యులు మేనేజర్ సిహెచ్. శ్రీనివాస్, కోచ్ సిహెచ్. సంధ్య , గోపి, గణేష్ తదితరులు పాల్గొన్నారు. బాలుర జట్టుకు స్పోర్ట్స్ డేస్ దాత ఎస్. శ్యామ్ రావు బాలికల జట్టుకి కె. రాజలింగం ఏవో, ఇరు జట్టులకు బస్ చార్జెస్ నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి రూ 5000/- అందజేసినట్టుగా కామారెడ్డి జిల్లా కబడి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాజన్న తెలిపారు, ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కుల కోసం గర్జించిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ)

**జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి: చలసాని శ్రీనివాస్‌రావు**




**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** దీర్ఘకాలికంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని టి యు డబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం టియుడబ్ల్యూజే (ఐజేయు) దేశవ్యాప్త డిమాండ్ల డే నిర్వహించాలన్న పిలుపుమేరకు ఎంజి రోడ్ లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టి, కొత్త బస్టాండ్ వద్ద రాస్తారోకో చేసి, భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు రాసిన వినతి పత్రాన్ని సూర్యాపేట జిల్లా కలెక్టర్ కు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరిని అవలంబిస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను జర్నలిస్టులకు వర్తింపచేయాలని, హెల్త్ కార్డులు, ఆరోగ్య భద్రత, కల్పించి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని, రైల్వే పాసులను కూడా యధావిధిగా అమలు చేయాలని, వృత్తిపై ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తున్న జర్నలిస్టులకు కనీస వేతనం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. టి యు డబ్ల్యూ జే ఐజేయు సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోల నాగేశ్వరరావు, డాక్టర్ కృష్ణ బంటు లు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులకు సమాజంలో రోజురోజుకు గౌరవం లేకుండా పోతుందని, ఇటీవల జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని, దాడులు నియంత్రణకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమాలలో టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల మల్లికార్జున్, రెబ్బ విజయ్, జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి శంకరమంచి రవీందర్ శర్మ, జిల్లా కోశాధికారి గుంటూరు రాము,దాడుల నిరోధక కమిటీ జిల్లా అధ్యక్షుడు బాదే రాము, సీనియర్ జర్నలిస్టులు వర్ధెల్లి అరుణ కృష్ణ, నరసింహస్వామి, ఎలుక రామ్ రెడ్డి,దుబ్బాక మల్లారెడ్డి,సుంకరబోయిన వెంకటయ్య,ధనియాకుల వెంకటేశ్వర్లు,పల్లె మణి బాబు, మర్రెడ్డి,కందుకూరి యాదగిరి,జి ఎస్ రెడ్డి,విక్రమ్,తల్లాడ చందన్, బైరబోయిన వెంకటేశ్వర్లు, షేక్ రషీద్, కందుల నాగరాజు, శిగ సురేష్, ఉయ్యాల నరసయ్య, కొండ్లె కృష్ణయ్య, వేణు, సుధాకర్, శ్రీరంగం వెంకన్న, సోమేశ్ గౌడ్, మామిడి శంకర్, పులుసు నాగరాజు, గుడిపూడి రామకృష్ణ, బిగ్ టీవీ రామకృష్ణ, మహా న్యూస్ సురేందర్, జలగం మధు, తండు వెంకన్న, దుర్గం బాలు, అయోధ్య రెడ్డి, యో యో టివి శంకర్, జహీర్, వల్దాస్ శంకర్, పాషా, రామచంద్ర రాజు,గుండాల లింగయ్య, లతీఫ్, అజీజ్, జానీ పాషా, జలీల్, సయ్యద్, రాంబాబు, రామకృష్ణ, మీరా, రవి, మధు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుల్లెట్ ట్రైన్ కోసం జరుగుతున్న మౌన దీక్షకు జర్నలిస్టులు సంఘీభావం తెలిపారు.

## జర్నలిస్టులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డులు ఇవ్వాలి

- ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డుల ద్వారా వినతి
- టి యు డబ్ల్యూ జే పిలుపుతో రంగారెడ్డి జిల్లాలో పోస్ట్ కార్డు ఉద్యమం
- గుల్మోహర్ పార్క్ పోస్ట్ ఆఫీస్ వద్ద భారీగా తరలివచ్చిన శేరిలింగంపల్లి జర్నలిస్టులు





**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( టి యు డబ్ల్యూ జే - హెచ్ - 143) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పోస్ట్ కార్డు ఉద్యమానికి రంగారెడ్డి జిల్లాలో అనూహ్య స్పందన లభించింది. రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి గుల్మోహర్ పార్క్ పోస్ట్ ఆఫీస్ వద్ద జర్నలిస్టులు సీఎం రేవంత్ రెడ్డికి వందలాది పోస్ట్ కార్డులు రాశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్, రాష్ట్ర కార్యదర్శి పైళ్ల విఠల్ రెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఉప్పరి రమేష్ సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్టు జగన్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు గంట్ల రాజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో పోరాడిన జర్నలిస్టులకు స్వరాష్ట్రంలో అన్యాయం జరుగుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. హెల్త్ కార్డులే కాకుండా ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ల మంజూరులో కూడా తీవ్ర జాప్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సతీష్ ముదిరాజ్, రాజు సాగర్, పులి అశోక్ గౌడ్, పరమేష్ సాగర్, జే.కృష్ణ, మహేష్ కుమార్, శివముదిరాజ్, దేవేందర్, కిరణ్, కృష్ణ, శ్రీకాంత్, మల్లేష్ కుమార్, కురుమయ్య , శ్రీనివాస్, సీతారాం సాగర్, రవి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మెహరున్నిసా బేగంకు ఘన సన్మానం

**వరల్డ్ స్కిల్స్ పోటీల్లో రజతం సాధించిన మెహరున్నిసా బేగం**



**కూకట్ పల్లి రాజముద్ర న్యూస్:** చైనాలోని షాంఘై వేదికగా జరిగిన 48వ 'వరల్డ్ స్కిల్స్ కాంపిటీషన్-2026'లో రజత పతకం సాధించి దేశ ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన మెహరున్నిసా బేగంను బాలానగర్ ప్రాంత ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు ఘనంగా సన్మానించారు. సుమారు 70 దేశాల నుంచి 1,400 మంది నైపుణ్యవంతులు పాల్గొన్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో, లాజిస్టిక్స్ & ఫ్రైట్ ఫార్వర్డింగ్ విభాగంలో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించిన మెహరున్నిసా అద్భుత ప్రతిభ కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్‌కు చెందిన బేకరీ కార్మికుడు మహమ్మద్ జావిద్ కుమార్తె అయిన మెహరున్నిసా అంతర్జాతీయ సరుకు రవాణా, కార్గో హ్యాండ్లింగ్, ఎగుమతి–దిగుమతి డాక్యుమెంటేషన్, కస్టమ్స్ క్లియరెన్స్ వంటి అత్యంత క్లిష్టమైన విభాగాల్లో విశేష ప్రతిభ చూపి ఈ విజయం సాధించింది. ఈ సందర్భంగా బాలానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎల్.ఎస్. రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్, ఏఐఎంఐఎం నేత మహంకాళి శంకర్, కాంగ్రెస్ మాజీ డివిజన్ అధ్యక్షుడు మధు గౌడ్, సమంత్ గౌడ్, అక్రమ్, గోవర్ధన్ రెడ్డి, దివాకర్ తదితరులు ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. పేదరికం ఏనాడూ ప్రతిభకు, విజయానికి అడ్డంకి కాదని మెహరున్నిసా నిరూపించి ఎంతోమంది ఆడపిల్లలకు ఆదర్శంగా నిలిచిందని నేతలు కొనియాడారు. బేకరీలో శ్రమిస్తూనే కుమార్తెను ఉన్నత లక్ష్యం వైపు నడిపించిన తండ్రి జావిద్‌ను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మెహరున్నిసా మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

## ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

- మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకొని వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశము హాలు నందు శుక్రవారం గాంధీజీ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహ మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆదర్శప్రాయమని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు నిబద్ధతతో సేవలందిస్తూ గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, మెప్మా రవికుమార్, గ్రౌండ్ వాటర్ రవి, సెక్షన్ సుపరింటెండెంట్ భరత్, రమేష్, సి సి లు నరేందర్, రామకృష్ణ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ లో తొలి ముద్ద కార్యక్రమం ఘనంగా ప్రారంభం

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** పౌష్టికాహారం అందించి చిన్నారుల సంపూర్ణ వికాసానికి తోడ్పడే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తొలి ముద్ద కార్యక్రమాన్ని వికారాబాద్ లో ఘనంగా ప్రారంభించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ వికారాబాద్ ఆధ్వర్యంలో వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రామయ్యగూడ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీ సీఈఓ సుధీర్ వికారాబాద్ మునిసిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్ద సుధాకర్ రెడ్డి హాజరై చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి సమతుల్యమైన పోషకాహారం ఎంతో అవసరమని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతోపాటు వారి ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన తొలి ముద్ద కార్యక్రమం ద్వారా. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి , తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ కి వికారాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య కి ప్రజలు వీళ్ళకి ఎప్పటికీ ధన్యవాదములు తెలిపారు. సంతోషకరమైన తొలిముద్దు కార్యక్రమం చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ జగదీశ్వరి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె. కాంతారావు, సీడీపీఓ ఈ. శ్రీలత, సూపర్వైజర్ షాలిని, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# పర్వీన్ హూడాకు స్వర్ణం

## భారత్‌కు 13వ పతకం

**నాగోయా, అక్టోబరు 2 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** ఆసియా క్రీడల్లో భారత బాక్సర్ పర్వీన్ హూడా స్వర్ణ పతకం సాధించింది. మహిళల 65 కేజీల విభాగంలో చైనీస్ తైపెకు చెందిన చెన్ నిన్-చిన్‌పై 3-2 తేడాతో విజయం సాధించి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో పర్వీన్ చివరి రౌండ్‌లో నిలకడగా పోరాడి విజయం అందుకుంది. తొలి రెండు రౌండ్లలో పోరు తీవ్రంగా సాగింది. ఇరువురు బాక్సర్లు పంచ్‌లతో ప్రతిదాడులకు దిగడంతో స్కోరు సమంగా మారింది. నిర్ణయాత్మక మూడో రౌండ్‌లో పర్వీన్ ప్రత్యర్థి దాడులను సమర్థంగా ఎదుర్కొంటూ కీలక పంచ్‌లు సంధించింది. చివరకు న్యాయనిర్ణేతలు 3-2తో పర్వీన్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. పర్వీన్ విజయం ద్వారా ఆసియా క్రీడల బాక్సింగ్‌లో భారత్‌కు ఒకే రోజున రెండో మహిళల స్వర్ణం లభించింది. అంతకుముందు లవ్లీనా బోర్గోహెయిన్ మహిళల 75 కేజీల విభాగంలో పసిడి పతకం సాధించింది. పర్వీన్ స్వర్ణంతో ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో 13వ స్వర్ణ పతకం చేరింది. పర్వీన్ హూడా గతంలోనూ ఆసియా క్రీడల్లో పతకం సాధించింది. 2022 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో ఆమె కాంస్యం గెలిచినా, అనంతరం డోపింగ్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన సస్పెన్షన్ కారణంగా ఆ పతకాన్ని కోల్పోయింది. ఈసారి అదే వేదికపై స్వర్ణం సాధించడం ఆమెకు కీలక పునరాగమనంగా నిలిచింది.

# సుజీత్ కల్కల్‌కు స్వర్ణం

## 2-9 నుంచి సంచలన విజయం

**నాగోయా, అక్టోబరు 2 :** ఆసియా క్రీడల్లో భారత రెజ్లర్ సుజీత్ కల్కల్ సత్తా చాటాడు. పురుషుల 65 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. ఫైనల్లో తజకిస్థాన్‌కు చెందిన అబ్దుల్‌మజీద్ కుదేవ్‌పై 10-9 తేడాతో అద్భుత విజయం నమోదు చేశాడు. దీంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్‌కు రెజ్లింగ్‌లో తొలి స్వర్ణం లభించింది. ఫైనల్లో సుజీత్ ఆరంభంలో తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ఒక దశలో 2-9తో వెనుకబడ్డాడు. అయితే చివరి దశలో అనూహ్యంగా పుంజుకున్న భారత రెజ్లర్ వరుస పాయింట్లు సాధించాడు. కీలక సమయాల్లో రెండు టేక్‌డౌన్లు సాధించి స్కోరును 10-9కు తీసుకెళ్లాడు. చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకుని స్వర్ణాన్ని సొంతం చేసుకున్నాడు. సుజీత్ విజయంతో పాటు అక్టోబరు 2న భారత్‌కు బాక్సింగ్, ఆర్చరీలోనూ స్వర్ణాలు దక్కాయి. పురుషుల 80 కేజీల బాక్సింగ్‌లో అంకుశ్ పంగల్ స్వర్ణం సాధించాడు. మహిళల 65 కేజీల్లో పర్వీన్ హూడా, 75 కేజీల్లో లవ్లీనా బోర్గొహైన్ కూడా పసిడి పతకాలు గెలిచారు. మహిళల రికర్వ్ టీమ్ ఆర్చరీలోనూ భారత్ స్వర్ణం సాధించింది. దీంతో భారత్ పతకాల సంఖ్య 75కు చేరగా.. అందులో 15 స్వర్ణాలు, 25 రజతాలు, 35 కాంస్యాలు ఉన్నాయిన్నాడు. ఇండియన్ రెజ్లర్‌ను అటాక్ చేయకుండా అడ్డుకున్నాడు. దీంతో 0-4 తేడాతో నితేశ్ ఓడిపోయాడు. గ్రీకో రోమన్ స్టయిల్ రెజ్లింగ్‌లో గతంలో ఇండియాకు రెండు సార్లు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. 1962లో జకర్తాలో జరిగిన గేమ్స్‌లో 52కేజీల విభాగంలో మాల్వా సింగ్, 97 కేజీల విభాగంలో గణపత్ అండాల్కర్ స్వర్ణ పతకాలు గెలిచారు. ఇవాళ జరిగిన ఫైనల్లో నితేశ్‌ను స్కోరింగ్ చేయకుండా జపనీస్ ప్లేయర్ నిలువరించాడు. ఫస్ట్ బౌట్‌ను 2-0 తేడాతో నకాజాటో ముగించాడు. లోకల్ ఫేవరేట్ అయిన నకాజాటో సెకండ్ బౌట్‌లో విజయవంతంగా నితేశ్‌ను నేలకూల్చాడు. దీంతో అతనికి 4-0 ఆధిక్యం లభించింది. చివరి నిమిషంలో నితేశ్ అటాక్ చేసినా.. నకాజాటో తన డిఫెన్స్ టెక్నిక్‌తో అడ్డుకున్నాడు.



# 44 ఏళ్ల నిరీక్షణకు తెర

## హాకీలో భారత్‌కు పసిడి!

### ఆసియా క్రీడల మహిళల హాకీలో రెండోసారి స్వర్ణం

### డిఫెండింగ్ ఛాంపియన్ చైనాపై 1-0తో భారత్ సంచలన విజయం




**గిఫు, అక్టోబర్ 2 :** నలభై నాలుగేళ్ల నిరీక్షణ ముగిసింది.. భారత మహిళల హాకీ జట్టు మళ్లీ ఆసియా రారాణిగా అవతరించింది. ఐచి-నగోయా ఆసియా క్రీడల మహిళల హాకీ ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను 1-0తో మట్టికరిపించి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. 1982 ఢిల్లీ ఆసియా క్రీడల తర్వాత భారత్‌కు మహిళల హాకీలో ఇదే తొలి పసిడి. మొత్తంగా ఇది రెండో స్వర్ణ పతకం. ఆరంభం నుంచే హోరాహోరీగా సాగిన ఫైనల్లో పదో నిమిషంలో లాల్‌రెమ్‌సియామి అద్భుతమైన రివర్స్ హిట్‌తో చైనా గోల్‌పోస్టును ఛేదించింది. తన 200వ అంతర్జాతీయ మ్యాచ్‌లోనే ఆమె చేసిన ఈ గోల్ భారత్‌కు చారిత్రక స్వర్ణాన్ని అందించడం విశేషం. ఆ తర్వాత చైనా వరుస దాడులతో ఒత్తిడి పెంచినా భారత రక్షణ విభాగం పట్టువదల్లేదు. చైనాకు లభించిన పెనాల్టీ స్ట్రోక్‌ను భారత గోల్‌కీపర్ సవిత అద్భుతంగా అడ్డుకోవడం మ్యాచ్‌లో కీలక మలుపుగా నిలిచింది. చివరి నిమిషాల్లో చైనా గోల్‌కీపర్‌ను కూడా బయటకు తీసి అదనపు ఆటగాడితో దాడికి దిగినా భారత డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది. తుది విజిల్ మోగగానే భారత క్రీడాకారిణుల సంబరాలు మిన్నంటాయి.

### పసిడితో పాటు ఒలింపిక్స్ టికెట్

ఈ విజయం భారత్‌కు ఆసియా క్రీడల స్వర్ణంతోపాటు మరో భారీ బహుమతిని అందించింది. ఆసియా క్రీడల్లో విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. ఆసియా క్రీడల పురుషుల, మహిళల హాకీ విజేతలకు నేరుగా ఒలింపిక్ బెర్త్ లభిస్తుందని అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రకటించింది. 1982లో తొలిసారి ఆసియా క్రీడల మహిళల హాకీలో స్వర్ణం సాధించిన భారత్.. ఆ తర్వాత 1998, 2018లో ఫైనల్‌కు చేరినా రజతంతో సరిపెట్టుకుంది. ఇప్పుడు 44 ఏళ్ల తర్వాత మరోసారి అగ్రస్థానాన్ని అందుకుని చరిత్ర సృష్టించింది.

# 2023 ఓటమి గుర్తుంది..

## 2027 ప్రపంచకప్ గెలవాలి: గిల్

**కేప్‌టౌన్, అక్టోబరు 2 :** 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఎదురైన ఓటమి ఇంకా గుర్తుందని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. ఆ లోటును 2027 ప్రపంచకప్‌లో పూడ్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నాడు. 2027 ప్రపంచకప్ తనకు, భారత జట్టుకు ఎంతో ప్రత్యేకమైనదని చెప్పాడు. 2023 ప్రపంచకప్‌లో భారత్ అద్భుతంగా ఆడినా.. ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోవడం బాధించిందని గిల్ పేర్కొన్నాడు. ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ ఫలితం మొత్తం టోర్నీపై ప్రభావం చూపుతుందని, ఫైనల్లో ఓడిపోవడం మరింత బాధాకరమని చెప్పాడు. అందుకే 2027 ప్రపంచకప్‌ను పూర్తి చేయాల్సిన పనిగా భావిస్తున్నామని వెల్లడించాడు. 2027 వన్డే ప్రపంచకప్ అక్టోబరు 2న ప్రారంభం కానుంది. భారత్ తన తొలి మ్యాచ్‌లోనే ఆస్ట్రేలియాను ఎదుర్కోనుంది. అక్టోబరు 7న కేప్‌టౌన్‌లో ఈ మ్యాచ్ జరగనుంది. 2023 ప్రపంచకప్ ఫైనల్లోనూ భారత్-ఆస్ట్రేలియానే తలపడగా.. అహ్మదాబాద్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా విజయం సాధించింది.దేశం తరఫున ప్రపంచకప్‌లో ఆడే అవకాశం కెరీర్‌లో పరిమితంగానే లభిస్తుందని గిల్ అన్నాడు. అందుకే ప్రతి ప్రపంచకప్ తనకు ప్రత్యేకమేనని పేర్కొన్నాడు. కెప్టెన్సీ చిన్నప్పటి తన ప్రధాన లక్ష్యం కాదని, భారత్ తరఫున ఆడి జట్టును గెలిపించడమే తన అసలు కోరిక అని తెలిపాడు. వ్యక్తిగత రికార్డులు, ర్యాంకింగ్స్ కంటే జట్టు విజయం తనకు ముఖ్యమని గిల్ స్పష్టం చేశాడు.




# ఫజల్‌హక్ ఫరూఖీకి జాక్‌పాట్

### రూ.3.6 కోట్లకు అమ్మకం

**దుబాయ్, అక్టోబరు 2 :** అంతర్జాతీయ లీగ్ టీ20-2026 వేలంలో అఫ్ఘానిస్థాన్ పేసర్ ఫజల్‌హక్ ఫరూఖీకి భారీ ధర పలికింది. ముంబై ఇండియన్స్ ఎమిరేట్స్ ఫరూఖీని 3,80,000 అమెరికన్ డాలర్లకు.. అంటే సుమారు రూ.3.6 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో ఐఎల్‌టీ20 చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడైన ఆటగాడిగా ఫరూఖీ రికార్డు సృష్టించాడు. ఫరూఖీకి ముందు ఈ రికార్డు వెస్టిండీస్ ఆటగాడు ఆండ్రీ ఫ్లెచర్ పేరిట ఉండేది. ఐఎల్‌టీ20 నాలుగో సీజన్ వేలంలో ఫ్లెచర్‌ను ఎంఐ ఫ్రాంచైజీ 2,60,000 అమెరికన్ డాలర్లకు.. దాదాపు రూ.2.45 కోట్లకు కొనుగోలు చేసింది. తాజాగా ఫరూఖీ కోసం ముంబై ఇండియన్స్ ఎమిరేట్స్ అంతకంటే భారీ మొత్తాన్ని వెచ్చించి ఆ రికార్డును అధిగమించింది.ఇదే వేలంలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, అఫ్ఘానిస్థాన్ వికెట్‌కీపర్ బ్యాటర్ రహ్మానుల్లా గుర్బాజ్ కూడా భారీ ధర పలికారు. లివింగ్‌స్టోన్‌ను 3,50,000 డాలర్లకు.. సుమారు రూ.3.36 కోట్లకు గల్ఫ్ జెయింట్స్ దక్కించుకుంది. గుర్బాజ్‌ను 3,10,000 డాలర్లకు.. దాదాపు రూ.3 కోట్లకు అదే జట్టు రైట్-టు-మ్యాచ్ అవకాశాన్ని ఉపయోగించి సొంతం చేసుకుంది. దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ కోసం కూడా ఫ్రాంచైజీల మధ్య పోటీ నెలకొంది. చివరకు దుబాయ్ క్యాపిటల్స్ అతడిని 3,00,000 అమెరికన్ డాలర్లకు కొనుగోలు చేసింది. ఫరూఖీకి దక్కిన భారీ ధరతో ఐఎల్‌టీ20 వేలంలో నాణ్యమైన పేసర్లకు ఉన్న డిమాండ్ మరోసారి స్పష్టమైంది.



# వర్షం పడితే భారత్, పాక్‌కు సంయుక్త స్వర్ణం

**నాగోయా, అక్టోబరు 2 :** ఆసియా క్రీడలు-2026 పురుషుల క్రికెట్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య స్వర్ణ పతక పోరుకు రంగం సిద్ధమైంది. అక్టోబరు 3న జరిగే ఈ ఫైనల్‌కు వర్షం ముప్పు ఉండటంతో నిర్వాహకులు కీలక నిబంధనను ప్రకటించారు. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా రద్దై ఫలితం తేలకపోతే భారత్, పాకిస్థాన్‌లను సంయుక్త విజేతలుగా ప్రకటించి ఇరు జట్లకూ స్వర్ణ పతకాలు అందజేస్తారు. ఫైనల్‌కు ప్రత్యేకంగా రిజర్వ్ డే కేటాయించలేదు. నిర్ణీత రోజునే మ్యాచ్ ఫలితం తేలాల్సి ఉంటుంది. కనీసం ఐదు ఓవర్ల చొప్పున ఆట సాధ్యమైతే డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ పద్ధతిలో విజేతను నిర్ణయిస్తారు. అలా కనీస ఆట కూడా సాధ్యం కాకపోతే మ్యాచ్‌ను 'నో రిజల్ట్'గా ప్రకటించి రెండు జట్లకూ స్వర్ణం పంచుతారు. గత ఆసియా క్రీడల్లో ఫైనల్ రద్దైనప్పుడు మెరుగైన సీడింగ్ ఆధారంగా భారత్‌ను విజేతగా ప్రకటించగా.. ఈసారి ఆ విధానాన్ని మార్చారు. మ్యాచ్ టై అయితే సూపర్ ఓవర్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు. అయితే వాతావరణ పరిస్థితుల కారణంగా సూపర్ ఓవర్ కూడా నిర్వహించే అవకాశం లేకపోతే ఫైనల్ ఫలితం నిబంధనల ప్రకారం నిర్ణయించాల్సి ఉంటుంది. భారత్ సెమీఫైనల్లో శ్రీలంకను ఓడించగా.. పాకిస్థాన్ బంగ్లాదేశ్‌పై విజయం సాధించి తుదిపోరుకు చేరాయి. అక్టోబరు 3న జపాన్‌లోని నిష్షిన్‌లోని కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఈ మ్యాచ్ జరగనుంది.

